అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సోమవారం 25-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 326

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

ముగ్గురు ముస్లిం యువకుల బలి

సంభాల్‌లో మసీదు సర్వే హింసాత్మకం



13లో

భాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగం

15 మందిని అదుపులోకి తీసుకున్నాం : యూపీ అధికారుల వెల్లడి


ఎన్నికల్లో అవతకలపై దృష్టిని మరల్చే చర్య : అఖిలేశ్ యాదవ్

మోదానీ దోస్తానా!

2014 తర్వాతే అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

- విమర్శలకు జవాబుగా కక్ష సాధింపులు
- సెబీ నిష్క్రియాపరత్వం

ప్రధాని నరేంద్ర మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మధ్య అనేక సంవత్సరాలుగా సత్సంబంధాలు కొనసాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. భారత చరిత్రలో ఓ దేశ ప్రధానికి, ఓ పారిశ్రామికవేత్తకు మధ్య ఇంతలా సంబంధాలు పెనవేసుకుపోవడం గతంలో ఎన్నడూ జరగలేదు. అదానీ కోసం మోడీ పనిచేస్తున్నారని చెప్పడానికి ప్రతిపక్షాలు తరచుగా 'మోదానీ' అనే పదాన్ని ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. గత సంవత్సరం జరిగిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో 'మోడీ-అదానీ భాయ్ భాయ్/దేశ్ బెచ్ కీ ఖాయే మలాయ్' అనే నినాదం మార్మోగింది. అదానీ గ్రూప్ సంస్థలు అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నాయంటూ అమెరికా కోర్టు అభిశంసించడానికి చాలా కాలం క్రితమే పార్లమెంటులో ఈ నినాదాలు హోరెత్తాయి.మోడీ కూడా అదానీతో తనకున్న వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని దాచిపెట్టేందుకు ఏనాడూ ప్రయత్నించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండే మోడీ, అదానీల మధ్య అపవిత్ర సంబంధం ఉన్నదంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించినా ప్రధాని ఏ మాత్రమో పట్టించుకోలేదు. ప్రత్యేక ఆర్థిక మండలి కోసం అదానీకి గుజరాత్‌లో ప్రభుత్వ భూమిని కారుచౌకగా (చదరపు మీటరు ధర రూపాయి నుంచి 32 రూపాయల వరకూ) కట్టబెట్టారని కాంగ్రెస్ 2014కు ముందే చెప్పింది. మోడీని గొప్ప పాలనాదక్షుడిగా, సంస్కరణవాదిగా చూపేందుకు అదానీ గ్రూప్ ముమ్మరంగా కృషి చేసింది. ఈ నేపథ్యంలో మోడీ, అదానీ సంబంధాలపై 'ది వైర్' పోర్టల్ అందించిన కథనం మీ కోసం...



సెబి ఏం చేస్తోంది?

అదానీ గ్రూపు సంవత్సరాల తరబడి ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడుతున్నప్పటికీ సెబీ ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బచ్ పూరీపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రభుత్వం ఆమెను తొలగించలేదు. అదానీ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు కొన్ని శక్తులతో కూడిన భారీ నెట్‌వర్క్ పనిచేస్తోందని చెప్పడానికి ఇది సరిపోతుంది. అదానీకి ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలను ధారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం నిబంధనలు సవరించింది. అదానీ- అంబానీకి రూ.30 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ వాణిజ్యాన్ని అప్పగించేందుకు జరిగిన కుట్రలో భాగంగానే వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చారన్న ఆరోపణలూ వచ్చాయి. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న ఈడీ, సీబీఐలు అదానీపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోవడం లేదు.

న్యూఢిల్లీ : 2001లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పుడు అదానీ పెద్దగా పేరున్న వ్యక్తేమీ కాదు. 2014లో అదానీ నికర ఆస్తుల విలువ 2.8 బిలియన్ డాలర్లు మాత్రమే. అప్పట్లో ఫోర్బ్స్ జాబితా ప్రకారం ఆయనది భారతదేశంలోని సంపన్న వ్యక్తుల్లో 11వ స్థానం. కానీ 2022 ఏప్రిల్ నాటికి ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో రెండో వ్యక్తిగా నిలిచారు. అప్పుడు ఆయన నికర ఆస్తుల విలువ 90 బిలియన్ డాలర్లు.

ఇదేం స్పందన?

ఇటు దేశంలోనూ, అటు విదేశాల్లోనూ అదానీకి మేలు చేకూర్చేందుకు మోడీ ప్రధాని కార్యాలయాన్ని వాడుకున్నారని రాహుల్ గాంధీ అనేక బహిరంగ సభలు, పత్రికా సమావేశాల్లో చెబుతూ వచ్చారు. ఆ తర్వాత ఇతర రాజకీయ పార్టీల నేతలు కూడా రాహుల్‌కు మద్దతుగా మాట్లాడడం మొదలు పెట్టారు. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ సంచలన నివేదిక బయటపెట్టిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా, ఆమ్‌ఆద్మీ... 13లో

ఏ దేశమేగినా..

ఎన్ని ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ అదానీ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందింది. అదానీపై వచ్చిన ఆరోపణలు విస్మరించదగినవేమీ కావు. ఎందుకంటే అవి చాలా తీవ్రమైనవి. ప్రపంచవ్యాప్తంగా ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్, గనుల తవ్వకం, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగాల్లో వ్యాపార ప్రయోజనాలను విస్తరించుకోవడంలో అదానీకి మోడీ తన కార్యాలయం ద్వారా సాయపడ్డారని రాహుల్ అనేక సందర్భాల్లో ఆరోపించారు. అదానీ వ్యాపార ప్రయోజనాలు, ప్రాజెక్టు లు, కాంట్రాక్టులను ముందుకు తీసికెళ్లేందుకు మోడీ మన దేశ దౌత్య అధికారాన్ని ఉపయోగించారని కూడా ఆయన విమర్శించారు. మోడీ ఏ దేశం లో పర్యటించినా అక్కడ అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. అమెరికా పర్యటనకు ముందు శ్రీలంక, బంగ్లాదేశ్, కెన్యా, ఆస్ట్రేలియా దేశాల్లో వివాదా లు చెలరేగాయి. అయితే వీటిని మోడీ ఏ మాత్రం ఖాతరు చేయలేదు.



అదానీపై జేపీసీ వేయాలి

కేంద్రం వైఖరిపై ప్రధాని ప్రకటన చేయాలి

అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అదానీ అవినీతిపై చర్చించాలి. కేంద్రం వైఖరిని ప్రధాని మోడీ ప్రకటించాలి.. ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ అనెక్స్ భవనంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి జెపి నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్, అనుప్రియా పటేల్ (అప్నాదళ్), సీపీఐ(ఎం) తరపున ఎంపీ జాన్‌బ్రిట్టాస్, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగొయ్, కె. సురేష్, జేడీయూ నేత ఉపేంద్ర కుష్వాహా, కె.ఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్), లావు శ్రీకృష్ణదేవరాయులు (టీడీపీ), వల్లభనేని బాలశౌరి (జనసేన), విజయ సాయిరెడ్డి, మిథున్ రెడ్డి (వైసీపీ), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డీఎంకే), రాం గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), సంజయ్ సింగ్ (ఆప్), సంతోష్ కుమార్ (సీపీఐ), వైకో (ఎండిఎంకె), సస్మిత్ పాత్ర (బీజేడీ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్‌పీ) తదితరులు పాల్గొన్నారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు, మణిపూర్ అల్లర్లు, ఉత్తరప్రదేశ్‌లోని ఉప ఎన్నికల్లో అవకతవకలు, వక్ఫ్‌బిల్లుపై సభలో చర్చకు కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అలాగే కాలుష్యం, రైలు ప్రమాదాలు వంటి అంశాలపై కూడా చర్చించాలని డిమాండ్ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. ప్రజా ప్రయోజనాల అంశాలపై చర్చ జరపాలని స్పష్టం చేశామన్నారు. అయితే అన్ని అంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందని, సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్నాయి. నవంబర్ 26న 75 ఏండ్ల రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ హాల్‌లో సంవిధాన్ సదన్... 13లో

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

ఏఐసీసీ అగ్ర నేతలతో సమావేశం

మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. సోమవారం సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎంపీలు కూడా హస్తినకు వెళుతున్నట్టు తెలిసింది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ జరుగుతందనే ఊహాగానాల మధ్య రేవంత్ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మంత్రివర్గ విస్తరణతో పాటు పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో పాటు అగ్ర నేతలు సోనియా ఇతర ముఖ్య నేతలను కలిసి సీఎం ఆహ్వానించనున్నారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని కోరనున్నట్టు తెలుస్తోంది. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కూతురు వివాహానికి హాజరు కానున్నారు.



కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నల్లగొండ జిల్లా కేతేపల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-కేతెపల్లి

ప్రభుత్వాల్లో అస్థిరత, ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజలు కమ్యూనిస్టు పార్టీని కోరుకుంటున్నారని, దానికి నేడు శ్రీలంకలో కొలువుదీరిన కమ్యూనిస్టు ప్రభుత్వం నిదర్శనమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాసరెడ్డి పేరు మీద నూతనంగా నిర్మించిన సీపీఐ(ఎం) కార్యాలయ (ఎన్ఎస్ఆర్) భవనాన్ని ఆదివారం తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి మత రాజకీయాలను ప్రేరేపిస్తున్నదని అన్నారు. పన్నుల రూపంలో ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దారపోస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళనలో ఇండ్లు, భూమిని కోల్పోతున్న నిర్వాసితులకు ప్రత్యామ్నాయ వనరులు కల్పించాలని కోరారు. సామాన్య ప్రజల హక్కులకు పాలక ప్రభుత్వాలు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తే ప్రజలు తిరగబడతారన్న విషయాన్ని గమనించి పరిపాలన చేయాలని సూచించారు. లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, రైతురుణమాఫీ, రైతుభరోసా పక్కగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల గడీలను బద్దలు కొట్టి వారి ఆస్తులను పేదలకు పంచిన మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి పేరు మీద కార్యాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు... 13లో

రాజ్యాంగ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

భారతదేశం కార్పొరేట్ల రాజ్యమైంది



వివరాలు 2లో

రాజ్యం, మతం..ఒక్కటి కాదు

భారత రాజ్యాంగం మతానికి కాదు..మతోన్మాదానికే వ్యతిరేకం

సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోంది :

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య

ఆటపాటలతో ఉత్సాహంగా సాగిన సమ్మేళనం

కౌన్ బనేగా మహా సీఎం

ఫడ్నవీస్, శిండే, అజిత్ పవార్‌ల మధ్య కుర్చీలాట



మహారాష్ట్రలో తదుపరి సీఎం ఎవరన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అటు బీజేపీ దేవేంద్రఫడ్నవీస్ కాబోయే సీఎం అంటూ లీకులిస్తోంది. మరోవైపు ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ శిండే పోటీపడుతున్నారు. ఎన్సీపీ చీలికవర్గం నేత అజిత్ పవార్ కూడా తగ్గేదేలేదంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చైర్ రేసులో.. ఈ ముగ్గురి మధ్య ముక్కోణపు పోటీ కనిపిస్తోంది.

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమిని విజయం వరించింది. మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) ఘోర పరాజయాన్ని చవిచూసింది. కాగా ఇప్పుడు మహాయుతిలో ప్రభుత్వ ఏర్పాటు కత్తిమీద సాములా మారింది. మహాయుతిలో ఆ మూడు పార్టీల మధ్య లాబీయింగ్ పర్వం కొనసాగుతోంది. దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్...ఈ ముగ్గురిలో మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరు అనే ప్రశ్నకు ఇంకా సమాధానం రాలేదు. దీంతో మహారాష్ట్రలో తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

మహారాష్ట్రలోని 288 స్థానాలకు గాను 234 స్థానాలను ... 5లో



జీవ పరిణామానికి బలమైన ఆధారాలు

ఆధిపత్యం నిలబెట్టుకునేందుకే దానిపై వ్యతిరేకత

ద్వేషించినా, దూషించినా సరే...

జీవ పరిణామ సిద్ధాంతం గొప్ప శాస్త్రం : ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య

జేవీవీ తెలంగాణ ఆధ్వర్యంలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవ పరిణామానికి బ్రహ్మాండమైన ఆధారాలున్నాయని జన విజ్ఞాన వేదిక సైన్స్ కమ్యూనికేషన్స్ కన్వీనర్, ఎన్ఐటీ (వరంగల్) ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య తెలిపారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో "జీవ పరిణామ సిద్ధాంత ప్రచార కార్యక్రమం" ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షులు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దాసరి ప్రసాద్ రావు ప్రచారోద్యమ గోడపత్రికను విడుదల చేశారు. జేవీవీ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ కట్టా సత్య ప్రసాద్ రచించిన "దాచేస్తే దాగని సత్యం జీవ పరిణామం" పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఆధిపత్యం నిలబెట్టుకునేందుకు జీవ పరిణామ ... 5లో

తెలంగాణ విముక్తికి మరో ఉద్యమం



60 ఏండ్ల స్వరాష్ట్ర పోరాటంలో చెరిగిపోని సంతకం కేసీఆర్

29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 13లో

శాసనసభాపక్ష నేతగా హేమంత్ సోరెన్

28న జార్ఖండ్ సీఎంగా ప్రమాణం



రాంచీ : జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఆయన గవర్నర్ సంతోష్ గంగ్వార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌కు తన రాజీనామాను సమర్పించారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇండియా బ్లాక్ ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పించారు. సోరెన్ వెంట ఫోరం నేతలు ఉన్నారు. హేమంత్ సోరెన్ మాట్లాడుతూ 28న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఇండియా ఫోరం తరపున ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామన్నారు. రాజీనామాను గవర్నర్‌కు సమర్పించానన్నారు.గవర్నర్ తనకు తాత్కాలిక సీఎంగా బాధ్యతలు... 13లో

రాజ్యాంగ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

- భారత రాజ్యాంగం మతానికి కాదు.. మతోన్మాదానికే వ్యతిరేకం : ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో.. వక్తలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య


హాజరైన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు

సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోంది..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గాంధీజీ చెప్పినట్టు రాజ్యం, మతం ఒక్కటి కాదని, రాజ్యాంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బీజాలు వేయాలని ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం మతానికి కాదు.. మతోన్మాదానికే వ్యతిరేకమని తెలిపారు. సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోందని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్ ఏచూరి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విజయవాడ మహాసభ ఇచ్చిన ఓ నినాదం గుర్తుచేశారు. 'ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ ఈజ్ ఏ కంప్లీట్ స్టూడెంట్' అని నమ్మితే మనం ఎక్కడున్నా ఎస్ఎఫ్ఐ విలువలతో నడుచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. సమాజం పట్ల స్పందించటమనేది మనకు ఎస్ఎఫ్ఐ నేర్పిందన్నారు. మరో రెండు రోజుల్లో భారత రాజ్యాంగ స్వర్ణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం ఓ చారిత్రకతను సంతరించుకుందని తెలిపారు. ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తెలుగునాట రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి బీజాలు వేయాలన్నారు. రాజ్యాంగ విలువలపైన ఎందుకు ఉద్యమం జరగకూడదని ప్రశ్నించారు. జస్టిస్ చిన్నపరెడ్డి ఒక తీర్పులో "లౌకిక రాజ్యాంగం మతాతీత సమాజాన్ని కాదు.. మతాతీత రాజ్యాన్ని కోరుతుంది' అని చెప్పారన్నారు. 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' అనే నినాదాన్ని ఎస్ఎఫ్ఐ ఇచ్చిన రోజు దాని లోతు తెలియకపోవచ్చు కానీ ప్రస్తుత సమాజంలో దాని ఆవశ్యకత ఏంటో బోధపడుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ ఉద్యమ సమయంలో భారత రాజ్యాంగంలోని మౌలిక విలువలు.. మతం, లౌకికతత్వంపై ఘర్షణ పడ్డామని, ఇప్పుడు ఆ ఘర్షణ విశ్వరూపం చూస్తున్నామని తెలిపారు. మత విశ్వాసాలున్న వారిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, కానీ మతం ఆధారంగా రాజకీయ సమీకరణాలు, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని, మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనలను వ్యతిరేకించాలని స్పష్టంచేశారు. మన పోరాటం మతంపైన కాదు.. మత ఉన్మాదం పైన అని అన్నారు. రాష్ట్రాల రాజకీయ ఉనికిపైన, న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తిపైన, భారతీయత భావనపైన దాడి జరుగుతోందన్నారు. ఆర్థిక అసమానతలు తొలగిపోవాలన్నారు. గౌతమ్ అదానీ గంటకు రూ.1600 కోట్లు సంపాదిస్తున్నారని, కానీ దేశంలో కటిక పేదరికంలో మగ్గేవారు అనేక మంది ఉన్నారని తెలిపారు. మతాన్ని విద్వేషంగా వాడుతున్న వారితో ఏ రకంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో పోరాడామో.. ఇప్పుడు కూడా ఆ మత విద్వేషాలకు వ్యతిరేకంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఒక అంకురార్పణ కావాలని పిలుపునిచ్చారు.

1500 మంది హాజరు..

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి 1500 మంది వరకు పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల్లో ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ మాజీ చైర్మెన్ లింగాల కమలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భారతీయతకు భాష్యం, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన సీతారాంఏచూరి, జనవిజ్ఞాన వేదిక జీవ పరిణామం తదితర పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. దీనికి ముందు ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మాటూరి రామచంద్రరావు సహా అశువులు బాసిన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఏజే రమేష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి ముందు ఎస్ఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ పూర్వ విద్యార్థి కొండపల్లి పావన్ ఆవిష్కరించగా.. మరో విద్యార్థి వీవీ లక్ష్మీనారాయణ రాజ్యాంగ ప్రవేశిక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, విప్లవ్‌కుమార్, కళ్యాణం వెంకటేశ్వర్లు, అనురాధ అధ్యక్షవర్గంగా ఈ ఆత్మీయ సమ్మేళనం కొనసాగింది.

భారతదేశం కార్పొరేట్ల రాజ్యమైంది.. : వి.కృష్ణయ్య



మోడీ అధికారంలోకి వచ్చాక భారతదేశం కార్పొరేట్ల రాజ్యంగా మారిందని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ అంటే ఆకాశం ఎంత ఎత్తు ఉందో అంత ఎత్తున ఆలోచించమనే భావోద్వేగం, అధ్యయనం పోరాటం నినాదం.. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమని చెప్పిన సిద్ధాంతం అన్నారు. 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' మూడు లక్ష్యాలు ఢిల్లీలో మోడీ వచ్చాక ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. భారతరాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో మనందరికీ సీతారాం ఏచూరి విప్పిచెప్పారన్నారు. మోడీ పదేండ్లలో 252 చట్టాలు చేశారని, వీటి ద్వారా దేశంలో మన జీడీపీలో 50శాతం కార్పొరేట్ కంపెనీల వాటా అయిందన్నారు. రైతుల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులన్నింటిపై కార్పొరేట్ కంపెనీల పెత్తనమేనని తెలిపారు. ప్రజల చేతుల్లో ఉండాల్సిన స్వాతంత్ర్యం ఇప్పుడు ఎవరి చేతుల్లో ఉందని ప్రశ్నించారు. భారత స్టాక్ మార్కెట్లోని 1500 కంపెనీల్లో 50 శాతం కార్పొరేట్ వాటా ఉందని అన్నారు. ప్రజలందరీ స్వాతంత్ర్యం కార్పొరేట్ స్వాతంత్రంగా మారుతోందన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నడవాల్సిన పార్లమెంట్.. మోడీ, ఆర్ఎస్ఎస్ నిర్ణయాల ప్రకారం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రాల హక్కులను కూడా హరించి వేస్తున్నారని, చివరకు పంట కాల్వల్లో పారే నీరు కూడా వారి నియంత్రణలో ఉంటోందని ఆరోపించారు. దేశంలోని 11 కోట్ల హెక్టార్ల భూములను రెండేండ్లలో డిజిటలైజ్ చేయాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. రాజ్యాంగమైనా ఉంటుందా.. అంటే ఉండకూడదూ అని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిర్ణయించుకున్నాయన్నారు. పెట్టుబడిదారీ మార్కెట్ కోసం ప్రపంచాన్ని అణుయుద్ధం వైపు పయనింపజేస్తున్నారని తెలిపారు. సోషలిజం వైపుగా ఈ ప్రపంచాన్ని నడిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వామపక్షాలు మినహా మిగిలిన రాజకీయ పార్టీలు అవినీతి చేస్తే తప్ప నడవలేని పరిస్థితి ఉందన్నారు.

అక్రమ నిర్మాణాల నేపథ్యంలో..
సినీ నటుడు అలీకి నోటీసులు

- ఎక్మామిడి గ్రామ పంచాయతీ జారీ



నవతెలంగాణ-నవాబుపేట

అక్రమ నిర్మాణాల విషయంలో సినీ నటుడు అలీకి పంచాయతీ కార్యదర్శి ఆదివారం నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎక్మామిడి గ్రామంలోని నటుడు అలీ ఫామ్‌హౌజ్‌లో నిర్మాణాలు చేపట్టారు. వీటికి పంచాయతీ నుంచి అనుమతి లేదు. దాంతో ఈ నెల 5వ తేదీన అలీకి పంచాయతీ కార్యదర్శి శోభారాణి నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉంటే పంచాయతీలో అందజేయాలని తెలిపారు. దీనిపై అలీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దాంతో మళ్లీ ఆదివారం రోజు పంచాయతీ కార్యదర్శి మరోసారి అలీకి నోటీసు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని నోటీసులు పేర్కొన్నారు. మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నయా కిడ్నాపర్స్

- ప్లాట్స్ అమ్ముతామంటూ మహిళల వాయిస్‌తో ఫోన్ కాల్స్
- రియల్ ఎస్టేట్ వ్యాపారి నారాయణ కిడ్నాప్, అనంతరం విడిచిపెట్టిన దుండగులు

నవతెలంగాణ-ఆదిభట్ల

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నయా కిడ్నాపర్స్ హల్‌చల్ చేస్తున్నారు. ప్లాట్స్ అమ్ముతామంటూ లేడీస్ వాయిస్ కాల్స్‌లో పలువురికి ఫోన్లు చేసి ప్లాట్స్ ఉన్నవి అమ్మి పెట్టమంటూ మాటలు కలుపుతూ వ్యాపారులను కిడ్నాప్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పట్టణం బోయవాడకు చెందిన నారాయణకు గుర్తు తెలియని వ్యక్తులు వారం రోజులుగా ఫోన్ కాల్ చేస్తూ తమకు ప్లాట్స్ ఉన్నవి అమ్మి పెట్టమని అడుగుతున్నారు. నారాయణ సరే అనడటంతో బొంగుళూర్ గేట్ సమీపంలోని మెట్రో సిటీ వెంచర్‌కి ఆదివారం పిలిపించుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న నలుగురు అగంతకులు నారాయణ కండ్లకు గంతలు కట్టి, గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. నారాయణ తలకు గన్ గురిపెట్టి కోటీ రూపాయలు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా బెదిరిపోయిన నారాయణ భయంతో వణుకుతూ డబ్బులు లేవని చెప్పడంతో పది ఖాళీ పేపర్స్ మీద సంతకాలు చేయించుకున్నారు. అనంతరం ఓఆర్ఆర్‌పై నారాయణతోపాటు అతని డ్రైవర్‌ను వదిలిపెట్టిన ఆగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడు నారాయణ ఆదిభట్ల పీఎస్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో ఘటన

నవతెలంగాణ-యాలాల


యాదప్ప (ఫైల్) జ్యోతి

ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని నాగసముందర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసముందర్ గ్రామానికి చెందిన మాసుల యాదప్ప(42), మాసుల జ్యోతి(32) దంపతులు. వీరికి కూతురు శ్రీలత, కుమారుడు సందీప్ ఉన్నారు. రెండేండ్ల క్రితం కూతురు వివాహం చేశారు. దీని కోసం దాదాపు రూ.7లక్షల వరకు అప్పు అయింది. వీరు వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కూతురి పెండ్లికి చేసిన అప్పు తీరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే పత్తికి వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న యాలాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాండూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూతురు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు విస్తరించాలి

- మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు వినతి



నవతెలంగాణ -పటాన్‌చెరు

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు పొడిగించాలని మెట్రోరైల్ సాధన సమితి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం మెట్రోరైల్ సాధన సమితి ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును విస్తరించాలని ప్రతిపాదించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పటాన్‌చెరు వరకు మాత్రమే ప్రతిపాదించిందని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సంగారెడ్డి జిల్లాకు లాభం జరగాలంటే పారిశ్రామిక వాడ ఇస్నాపూర్ వరకు మెట్రోను పొడగించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేవిధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించినట్టు మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు రుద్రారం శంకర్. అబ్దుల్ బాసిత్, ఈర్ల రాజు ముదిరాజ్, మెట్టు శ్రీధర్, పన్యాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంచాలి

- నేడు కలెక్టరేట్ల ముందు ధర్నాలు :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల పింఛన్ రూ.ఆరువేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య ఒక ప్రకనట విడుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో నేడు అన్నికలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వికలాంగులకు పింఛన్ పెంపుతో పాటు అనేక హామీలను ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చి 11 నెలలైనా వారికిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల ముందు ధర్నాలు నిర్వహించామనీ, అయినా హామీలులో సర్కారులో చలనం రానందున ధర్నాలు చేయబోతున్నామని తెలిపారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలి

- నేడు డీఎంహెచ్ఓ కార్యాలయాల ముందు ధర్నాలు జయప్రదం చేయాలి : వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 25న (నేడు) 33 జిల్లాల డీఎంహెచ్ఓ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నట్టు వైద్యారోగ్య శాఖలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో గల వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆ కమిటీ రాష్ట్ర నాయకులు కె.యాదా నాయక్, కె.సాయి రెడ్డి, శ్యాంసుందర్, శ్రీనివాస్, ఈ. కిరణ్ రెడ్డి, మధురిమ, మమత, ఏ.కవిత, సకల రెడ్డి, ఎండి.ఫసియుద్దీన్, జి.రాజశేఖర్, మత్స్యగిరి, ప్రియాంక, కే.సరోజ, పి.మంజుల, పుష్పలత, విజయ తదితరులు పాల్గొన్నారు.ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ చేయకపోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళన పోరాటాలు, నిరవధిక సమ్మెలు జరిగాయని ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కమిటీ ఏఎన్ఎంలతో చర్చించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నా... ఆ కమిటీ రిపోర్ట్ లేకుండా రాత పరీక్ష తేదీలు ప్రకటించడం వల్ల ఏఎన్ఎం తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ కమిటీని ఏఎన్ఎంలతో సమావేశపరిచి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలకు ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.



నాణ్యమైన విత్తనాలందించడంలో ఉద్యోగులది కీలక పాత్ర

- ఆత్మీయ సమ్మేళనంలో జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాణ్యమైన విత్తనాలందించడంలో విత్తన ధ్రువీకరణ ఉద్యోగులది కీలక పాత్ర అని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మెన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ధ్రువీరణ సంస్థను వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక విభాగం కింద పరిగణించి, డిపార్ట్ మెంట్ హోదా కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సంస్థ అభివృద్ధి విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తిరుపతి నాయక్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో విత్తన ధృవీకరణ సంస్థల పనితీరు అధ్యయనం చేసి విభాగంలో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సర్కార్‌కు సూచించారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధిలో ధ్రువీకరణ అధికారుల పాత్ర, ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఉద్యోగుల పెన్షన్‌ను రూ. 30 వేలకు పెంచాలనీ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించాలనీ, ఉద్యోగులకు కొత్త హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీని తీసుకొచ్చి ఆరోగ్య భద్రత కల్పించాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తన ధ్రువీరకరణ అధికారుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.జయ ప్రకాష్, పెబ్బేటి మహేష్, కోశాధికారి పృథ్విరాజ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం




బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ కవిత పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేలు పార్టీ మారారనే అంశంతో సంబంధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం భారత దేశ చరిత్రలో ఎక్కడా లేదని విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని వ్యాఖ్యానించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. అలా కాకుండా పదవినే పట్టుకుని పాకులాడితే ప్రజలు క్షమించరని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్ని ప్రారంభించలేదని విమర్శించారు. అనంతరం బీసీ నాయకులతో సమావేశమై కులగణనపై చర్చించారు. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం సమగ్రమైన నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్‌రావు, బొల్లా శివశంకర్, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచి

- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్నదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో జరిగిన పెరిక సామాజిక తరగతి కార్తీక వనభోజనాల కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన భోజనాలు సామాజిక తరగతుల ఐక్యతకు తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టిందనీ, దీంతో సామాజిక తరగతుల జనాభా తెలుస్తున్నదన్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, ఆయా వృత్తుల అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఆ సర్వేలో కుల పెద్దలు పాల్గొనాలనీ, సర్వే చేసే వారికి సహకరించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడగానే పెరిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. రూ. 50 కోట్ల నిధులు కేటాయించామన్నారు. యువత ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకునేందుకు దోహద పడుతుందని తెలిపారు.కుల గణన చేసుకోవటం మూలంగా ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరం అభివృద్ధి చేందేందుకు ఉపయోగపడుతున్నదని చెప్పారు. ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ పెరిక కుల కార్పోరేషన్ సాధన సమితి కోరిక మేరకు పెరిక కులానికి కార్పోరేషన్ ఏర్పాటు చేసి, రూ.50 కోట్లు కేటాయించిన ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ అంశం లో అత్యంత ముఖ్య పాత్ర పోషించిన ఆనాటి బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మెన్, ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితమేనన్నారు. ఆయనతో పాటు ఇందుకు కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కుల పెద్దలు పాల్గొన్నారు.

ప్రెస్‌మీట్ పెట్టే స్వేచ్ఛకూడా లేదా?

- అరెస్టులకు భయపడం ... బిల్లులిచ్చేదాకా పోరాటం
- డిసెంబర్ 1 తర్వాత కుటుంబ సభ్యులతో మాజీ సర్పంచుల ఆందోళనలు
- ప్రభుత్వం రూ.750 కోట్లు ఇచ్చిందనేది పచ్చి అబద్ధం
- ఇవ్వని వాటిని కూడా ఇచ్చామనటం సీఎం హోదాకు తగదు :తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాము గ్రామాల్లో అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఇవ్వలేదని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పే స్వేచ్ఛ లేదా? ఉగ్రవాదుల లెక్క మాజీ సర్పంచులను అరెస్టు చేయడం ఏంటి? పోలీసు స్టేషన్లకు తరలించడం ఏంటి? అని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి పూదారి నవీన్‌గౌడ్, కార్యదర్శి శేషబోయిన మల్లేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిసెంబర్ ఒకటో తేదీ వరకు పెండింగ్ బిల్లులను ఇవ్వకపోతే మాజీ సర్పంచులంతా కుటుంబ సభ్యులతో ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. గ్రామాల్లో మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.750 కోట్ల బిల్లులను చెల్లించామని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడం ఆయనకు తగదన్నారు. ఆదివారం సచివాలయం సమీపం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తామన్న తమను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ పంచాయతీ కార్మికులకు వేతనాలు, వీధిలైట్లు, బోర్ మోటార్లకు కరెంటు బిల్లులు, ఉపాధి హామీ చట్టం కింద వేసిన సీసీ రోడ్లు, కట్టిన పంచాయతీ భవనాలకే బిల్లులు వచ్చాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్‌డీఎఫ్ నిధులుగానీ, ఎస్ఎఫ్‌సీ నిధులుగానీ ఇవ్వలేదని తేల్చిచెప్పారు. పంచాయతీ జనరల్ ఫండ్ నిధులను ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. ఇప్పటికీ సర్పంచుల చెక్కులు ట్రెజరీలో మూలుగుతున్నాయని చెప్పారు. 2024 కి పూర్వం పెండింగ్ నిధుల్లో ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు 40 వేల కోట్ల బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం క్లియర్ చేసిందనీ, మాజీ సర్పంచు లకు చెందిన రూ.1200 కోట్ల పెండింగ్ బిల్లులను ఇవ్వడానికి ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. మాజీ సర్పంచులను మంత్రులు, ఆఫీసర్లు సచివాలయం చుట్టూ, అసెంబ్లీ చుట్టూ తిప్పించుకోవడం తగదనీ, ఇది కక్షసాధింపే అవుతుందని చెప్పారు. భేషజాలకు పోకుండా మాజీ సర్పంచుల బాధల్ని అర్థం చేసుకొని ఇచ్చేది కాస్త ఒకేసారి బిల్లుల్ని విడుదల చేయాలని కోరారు.

సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేనా

- ఎనిమిది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం
- 30 మందితో రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేన ఎన్నిక అయ్యారు. మూడు రోజుల పాటు న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన సీపీఐ(ఎం) ఢిల్లీ 17వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. మహాసభ ఎనిమిది మంది సభ్యులతో కూడిన కార్యదర్శివర్గం, 30 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుత సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనాను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యదర్శి వర్గంలో కెఎం తివారీ, పిఎంఎస్ గ్రావాల్, ఆశా శర్మ, సుబీర్ బెనర్జీ, రాజీవ్ కున్వర్, సెబా ఫరూకీ, పివి అనియన్ ఉన్నారు. కార్యదర్శి వర్గానికి ఆహ్వానితుడిగా సిద్దేశ్వర్ శుక్లేను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఆరుగురు కొత్త ముఖాలకు చోటు దక్కింది. ఎనిమిది మంది మహిళలు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషి ఘోష్ కూడా ఉన్నారు. అఖిల భారత మహాసభకు నలుగురు ప్రతినిధులు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కెఎం తివారీ రిలీవ్ అయ్యారు. సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ మహాసభకు హాజరై ప్రసంగించారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని, వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలని మహాసభ నిర్ణయించింది. అనురాగ్ సక్సేనా 1996 నుంచి పూర్తికాలం పార్టీ కార్యకర్తగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. 2009లో తొలిసారిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో అనేక కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారు. 1995 నుంచి 2003 వరకు కీలక సమయంలో ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. పోలీసుల క్రూరమైన దాడులతో పాటు అనేక కేసులు కూడా ఎదుర్కొన్నారు. 2003లో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు.

పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్

- గాజాలో 120 మంది ఊచకోత
- లెబనాన్‌లో మరో 15 మంది మృతి



గాజా: అమెరికా అండ చూసుకుని ఇజ్రాయిల్ అంతకంతకూ పేట్రేగి పోతోంది.మరీ ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడిగా పచ్చి మితవాది డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ఎన్నికైన తరువాత నెతన్యాహు యుద్ధోన్మాదం పతాక స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా పరిగణించి ,అయన అరెస్టుకు వారెంట్ కూడా జారీ చేసింది. అయినా, డోన్ట్ కేర్ అన్న రీతిలో ఈ ఫాసిస్టు నేత వ్యవహరి స్తున్నాడు.గడిచిన 48గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన క్రూర దాడుల్లో గాజాలో 120 మంది, బీరుట్‌లో 15 మంది మరణిం చారు. గాజా స్ట్రిప్ అంతటా ఇజ్రాయిల్ తన సైనిక దాడులను తీవ్రతరం చేసింది. గాజా ఉత్తర కోస్తా తీరాన ఉన్న ఆసుపత్రిపై బాంబుల వర్షం కురిపిం చింది. ఈ పాశవిక దాడిలో వైద్య సిబ్బంది కూడా గాయపడ్డారు. ఇదిలా వుండగా శనివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 15 మంది చనిపోయారు.

లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపండి

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి.. ఆంక్షలు ఎత్తేయండి

- జీవోలను సవరించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించండి
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి
- వీఆర్ఏల వారసులకు వారసత్వ ఉద్యోగాలివ్వాలి
- ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో కార్మిక వర్గం సమస్యలను పరిష్కరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
కార్మికుల హక్కులను హననం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేయవద్దని సీఎం రేవంత్‌రెడ్డిని సీఐటీయూ రాష్ట్ర కమిటీ కోరింది. లేబర్‌కోడ్‌లను అమలు చేయబోమంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించింది. ఈ మేరకు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ సవరించేందుకు జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో పెరుగుతున్న నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకోని విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే రాష్ట్రంలోని 1.20 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే విషయాన్ని సీఎంకు వివరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులివ్వాలని విన్నవించారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఆరేడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలనీ, ఎన్నికల హామీ మేరకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని విన్నవించారు. రెండో పీఆర్సీలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఎన్ని మ్యానిఫెస్టోలో పొందుపర్చినట్టుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18, వేల వేతనాన్ని ఇవ్వాలని విన్నవించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీఓ జారీ చేయాలన్నారు. ఆశా వర్కర్లకు పారితోషికాలు కాకుండా ఫిక్సిడ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం మిడ్‌డే మీల్స్ కార్మికులకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని విన్నవించారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలనీ, ఎన్నికల హామీ మేరకు వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

మీసేవా, కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఏఎన్ఎం, ఎన్‌హెచ్ఎం, ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికులు, 104, 108, ఆరోగ్యశ్రీ, టిసాక్స్, ఆయుష్, వైద్య విధాన పరిషత్ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది సిబ్బంది సర్వీసులు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో జీఓ నెం.142ను రద్దు చేయాలని, వైద్య విధాన పరిషత్ అటానమస్ హోదాను రద్దు చేసి ఉద్యోగులకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. జీఓ నెం.317 ద్వారా వస్తున్న ఉద్యోగుల విజ్ఞప్తులను పరిష్కరించాలనీ, ఆరోగ్యమిత్రలకు క్యాడర్ మార్పు చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, యూనివర్సిటీల్లో నాన్ టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలని కోరారు.ఆర్టీసీని కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి ప్రజాతంత్ర హక్కులు కల్పించాలనీ, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని విన్నవించారు. సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కోలిండియాలో మాదిరిగా ఆదాయ పన్నును సింగరేణి కార్మికులకు తిరిగి చెల్లించాలనీ, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కోలిండియా సిఫారసు చేసిన హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలనీ, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరికీ అర్హతను బట్టి జెఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్స్, సబ్ ఇంజనీర్స్, ఓఎస్‌లుగా కన్వర్షన్ ఇవ్వాలని, అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలని కోరారు. ఈపీఎఫ్ టు జీపీఎఫ్ మొత్తం ఉద్యోగులకు అమలు చేయాలని, విద్యుత్ సంస్థలో ఉన్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని కోరారు. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పిఆర్‌సి, డిఎ, హెచ్‌ఆర్ఏ మరియు వయోపరిమితి పెంపును అమలు చేయాలనీ, అందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిల్స్, స్కూటీలు వెంటనే ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సలహా మండలి కమిటీని కార్మిక సంఘాల నాయకులతో నియమించాలని కోరారు. బీడీ కార్మికులకు 26 రోజుల పనికల్పించి కనీన వేతనం ఇవ్వాలన్నారు. పీఎఫ్‌తో ముడి పెట్టకుండా బీడీ పరిశ్రమలో పనిచేసే అన్ని కేటగిరీ కార్మికులకు జీవనభృతి రూ.4,016 చెల్లించాలని కోరారు. హమాలీలకు, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్‌బోర్డులు ఏర్పాటు చేయాలనీ, వారికి రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. మహాలక్ష్మితో ఉపాధి దెబ్బతిన్న నేపథ్యంలో ప్రతినెలా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.4,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరమయ్యే వస్త్రాలను, మహిళా సంఘాలకు ఇచ్చే చీరలను తయారు చేసే బాధ్యతను చేనేత కార్మికులకు అప్పగించాలని కోరారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. పవర్‌లూమ్ కార్మికుడికి ప్రభుత్వ గ్యారంటీతో రూ.5 లక్షల పెట్టుబడి సాయం అందివ్వాలని విన్నవించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నుండే అందులో పనిచేసే కార్మికులకు వేతనాలు, ఈపిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, రూ.5 లక్షల బీమా పాలసీ చేయించాలని కోరారు. జీఓ నెం.81 ప్రకారం మిగిలిన 3,797 మంది విఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల ద్వారా రిపోర్టులు తెప్పించి తగు చర్యలు తీసుకొని పరిష్కరిస్తానని సీఎం హామీనిచ్చారని తెలిపారు.

జార్ఖండ్ అసెంబ్లీలో 12 మంది మహిళా ఎమ్మెల్యేలు





రాంచీ : జార్ఖండ్ నూతన శాసనసభకు మహిళలు రికార్డు స్థాయిలో ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో 12 మంది మహిళలు విజయం సాధించి శాసనసభలో ప్రవేశించబోతున్నారు. 2005లో ముగ్గురు, 2009లో 8 మంది, 2014లో 9 మంది, 2019లో 10 మంది మహిళా ఎమ్మెల్యేలు జార్ఖండ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. కొత్త ఎమ్మెల్యేల్లో 59 శాతం మంది పట్టభద్రులు కావడం విశేషం. జార్ఖండ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఇండి కూటమికి 56 స్థానాలు లభించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వారిలో 41 శాతం మంది హయ్యర్ సెకండరీ వరకూ విద్యను అభ్యసించారు. 37 శాతం మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా 22 శాతం మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివారు. నూతన శాసనసభలో 70 శాతం మంది ఎమ్మెల్యేలు వృత్తిపరంగా రాజకీయ నాయకులు లేదా సామాజిక కార్యకర్తలు. 37 శాతం మంది వ్యాపారాల్లో ఉన్నారు. 31 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడిన వారే. కేవలం రెండు శాతం మంది మాత్రమే గతంలో పభుత్వోద్యోగాలు చేశారు. నూతన శాసనసభ్యుల్లో 16 శాతం మంది 25-40 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా 47 శాతం మంది 41-55 సంవత్సరాల మధ్య వయసున్న వారు. 31 శాతం మంది 56-70 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా 6 శాతం మంది 70 సంవత్సరాల పైబడిన వారు.

ఝాన్సీ ఆస్పత్రి దుర్ఘటన

- మరో ఇద్దరు శిశువుల మృతి
- 17కు చేరిన మృతుల సంఖ్య

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఝాన్సీ పట్టణంలోని ఆస్పత్రిలో జరిగిన అగ్ని ప్రమాదం నుంచి రక్షించిన నవజాత శిశువుల్లో మరో ఇద్దరు ఆదివారం మరణించారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 17కు చేరుకుంది. ఈ విషయాన్ని ఆస్పత్రికి చెందిన సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. ఈ నెల 15 రాత్రిన మహరాణి లక్ష్మీ బాయ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి చిన్నపిల్లల వార్డులో అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. అదే రోజున 10 మంది నవజాత శిశులు మరణించగా, 39 మందిని రక్షించి వేరే వార్డుకు తరలించారు. వీరిలో ఇద్దరు శనివారం మరణించారని ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర సింగ్ సెనగార్ ఆదివారం తెలిపారు. ఈ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించామని, ఇందులో 'అనారోగ్యం' కారణంగానే శిశువులు మృతి చెందినట్లు రుజువయిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించినట్లు తెలిపారు.

గవర్నర్ తీరుపై గుస్సా

తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్న పశ్చిమ బెంగాల్ గవర్నర్

- తప్పుబట్టిన అధికార టీఎంసీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్
- సామాజి మాధ్యమాల్లో వీడియో వైరల్.. నెటిజన్ల ఆగ్రహం



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి ఆనంద్ బోస్ చర్య వివాదాంశంగా మారింది. గతంలో ఓ మహిళపై రాజ్‌భవన్‌లోనే లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. తాజాగా గవర్నర్‌గా రెండేండ్ల పదవీ కాలం పూర్తైన సందర్భంగా రాజ్‌భవన్‌లో ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు. ఈ చర్య ఇప్పుడు రాజకీయంగా తీవ్ర వివాదానికి దారి తీసింది. గవర్నర్ చర్యను ప్రతిపక్ష పార్టీలు తప్పుబట్టాయి. పాఠశాల విద్యార్థుల కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ పోటీనీ, పేయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించటానికి ముందు గవర్నర్ తన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు సైతం తీవ్రంగా స్పందించారు. అయితే, గవర్నర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదనీ, అది ఒక కళాకారుడు బహూకరించాడని గవర్నర్ కార్యాలయం వివరణ ఇచ్చింది.

గవర్నర్ చర్యపై పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. దీనిని పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించింది. " ఎక్కడా వినని విధంగా మన గవర్నర్ సి.వి ఆనంద్ బోస్.. తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు. ఆయన తనకు కొంత పబ్లిసిటీ కావాలనుకున్నారు. అందుకే ఇలా చేశారు. తర్వాత ఏం చేస్తారు? ఆయన తన విగ్రహానికి పూలమాల వేస్తారా?" అని టీఎంసీ నేత జయప్రకాశ్ మజుందార్ అన్నారు. గవర్నర్ చర్య అవమానకరం, దురదృష్టకరమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి అన్నారు. ఇది సిగ్గుపడాల్సిన విషయమనీ, బెంగాల్ సంస్కృతిపై చిన్న ఆటగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సౌమ్య ఐచ్ రాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సి.వి ఆనంద్ బోస్ చర్యతో రాజకీయ దుమారం

గవర్నర్ తీరుపై ప్రతిపక్షాలే కాదు.. ఇటు నెటిజన్లు సైతం తీవ్రంగా స్పందిస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఆయన.. రాజ్‌భవన్‌లో తన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంకు చెందిన ఆర్టిస్ట్ పార్థ సాహా.. ఈ విగ్రహాన్ని గవర్నర్‌కు బహూకరించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విగ్రహాన్ని గవర్నర్ ఏర్పాటు చేయలేదనీ, ఆర్టిస్ట్, ఇండియన్ మ్యూజియం నుంచి గిఫ్ట్‌గా వచ్చిందని గవర్నర్ కార్యాలయం స్పష్టతనిచ్చింది. అయినప్పటికీ, ఈ ఘటనపై విమర్శనల పర్వానికి అడ్డుపడలేదు. బతికున్న వ్యక్తి విగ్రహ ఏర్పాటు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆనంద్ బోస్.. రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేండ్లు కావస్తున్నది. ఈ రెండేండ్లలో ఇటు ఇటు గవర్నర్‌కు, అటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అంత సఖ్యత లేదనే రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. గవర్నర్ వ్యవహార శైలిని అధికార టీఎంసీ ఎప్పటికప్పుడూ వ్యతిరేకిస్తూ వస్తున్నదనీ, ఇలాంటి తరుణంలో విగ్రహావిష్కరణ చర్య ఆయనకు మైనస్‌గా మారుతుందని అంటున్నారు. కాగా, తన విగ్రహావిష్కరణ సమయంలో.. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి ఏమాత్రమూ బాగాలేదని గవర్నర్ చెప్పటం గమనార్హం.

కుదిరిన రాజీ

మాట నెగ్గించుకున్న సంపన్న దేశాలు

- 30 వేల కోట్ల డాలర్ల ప్యాకేజితో సరి



బాకూ: కాప్ ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కి సంబంధించిన పార్టీల కాన్ఫరెన్స్ 29వ సెషన్‌లో సంపన్న దేశాలు తమ మాట నెగ్గించుకున్నాయి. వాతావరణంలోకి పెద్దయెత్తున కర్బన ఉద్గారాలను విడుదలజేసే సంపన్న దేశాలు క్లైమేట్ ఫైనాన్స్ కింద ఏటా లక్షా 30 వేల కోట్ల డాలర్లు చెల్లించాలని పేద, వర్ధమాన దేశాలు పట్టుబట్టగా సంపన్న దేశాలు 25 వేల కోట్ల డాలర్లతో సరిపెట్టాలని చూశాయి. దీనిని ఎట్టి పరిస్థితుల్లోను తాము అంగీకరించేది లేదని బడుగు దేశాలు స్పష్టం చేయడంతో కాప్-29 చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. దీనిని తొలగించడం కోసం సంపన్న దేశాలు కంటి తుడుపు చర్యగా 30 వేల కోట్లకు పెంచుతూ సరికొత్త ప్రతిపాదనను ఆఖరి నిమిషంలో తీసుకొచ్చాయి. ఇంతకు మించి ఒక్క డాలర్ కూడా అదనంగా ఇచ్చేది లేదని తెగేసి చెప్పాయి. అప్పటికే కాలాతీతం కావడంతో అనేక తర్జన భర్జనల అనంతరం ఆదివారం తెల్లవారుజామున 30 వేల కోట్ల డాలర్లు ప్యాకేజీకి బడుగు దేశాలు అయిష్టంగానే ఆమోదం తెలిపాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా వచ్చే నెల 21న ఉస్మానియా యూనివర్సిటీలో కృతజ్ఞత బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని చామల నివాసంలో ఓయూ నేతలతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చామల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ జరిగిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతికత లేదని చెప్పారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించినా కేసీఆర్ నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 54000 ఉద్యోగాల భర్తీ చేసినట్టు తెలిపారు. తెలంగాణ యువత కోరుకున్న ప్రజా పాలన వచ్చిందన్నారు. నిరుద్యోగులకు కొత్తగా న్యూఇయర్‌లో మరిన్ని ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో నిరుద్యోగులకు వరంగా మారబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ యాదవ్, మీడియా కో ఆర్డినేటర్ వచన్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు చేడే మహేందర్, మల్లికార్జున కోట, దనుజయ్, ఓయు ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు మెడ శ్రీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



మణిపూర్ మహిళల హత్యకేసులో మలుపు

- పోస్టుమార్టం నివేదికలో షాకింగ్ విషయాలు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఇటీవల అపహరణ, ఆ తర్వాత హత్యకు గురైన మహిళలు, చిన్నారుల పోస్టుమార్టం నివేదికలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. వీరిని అత్యంత పాశవికంగా హత్య చేసినట్టు నివేదికలో తేలింది. మూడేండ్ల బాలుడు సహా మహిళల మ ృతదేహాలపై కాల్పుల ఆనవాళ్లతోపాటు అనేక చోట్ల గాయాలున్నాయని వెల్లడైంది.

బాలుడి కన్ను కనిపించకపోవడంతోపాటు అతడి పుర్రెలో బుల్లెట్ గాయాలున్నాయని, ఛాతీపై దెబ్బలు, కత్తిగాట్లు, నుదిటిపైనా గాయాలున్నట్టు పోస్టుమార్టం నివేదికలో తేలింది. బాలుడి మ ృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. అయితే, మ ృతికి గల కారణాలను పెండింగ్‌లో ఉంచారని, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత వాటిని వెల్లడించనున్నట్టు సమాచారం.

బాలుడి తల్లి మృతదేహంపై మూడు బుల్లెట్ గాయాలున్నట్టు శవపరీక్షలో తేలింది. చిన్నారి నానమ్మ(60) శరీరంపై ఐదు బుల్లెట్ గాయాలున్నాయని.. పుర్రెలో ఒకటి, ఛాతీలో రెండు, పొట్ట, భుజంపై కాల్పులు జరిగినట్టు గుర్తించారు. ఈ ఇద్దరు మహిళల శరీరాలపై అనేక చోట్ల గాయాలున్నట్టు వైద్యులు వెల్లడించారు. మరో మహిళ, ఇద్దరు చిన్నారుల పోస్టుమార్టం నివేదికలు వెల్లడి కావాల్సి ఉందన్నారు.

మైతేయ్ వర్గానికి చెందిన తొమ్మిది మంది మృతుల్లో ఆరుగురు నవంబర్ 11న అపహరణకు గురైన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారుల ఉండగా.. వీరి మ ృతదేహాలు నదిలో కొట్టుకురావడం సంచలనం రేపింది. రోజుల వ్యవధిలో లభ్యమైన వీరి మ ృతదేహాలకు అసోంలోని సిల్చర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వీటిని తీసుకెళ్లడానికి నిరాకరించిన బాధిత కుటుంబాలు.. న్యాయం జరిగే వరకూ తీసుకెళ్లే ప్రసక్తే లేదని పేర్కొన్నాయి. చివరకు అధికారులు వారిని ఒప్పించి మణిపూర్‌లోని జిరిబామ్‌కు మ ృతదేహాలను తరలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య మృతులకు ఇటీవల అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఇప్పటివరకు మణిపూర్ హింసలో 258 మందికి పైగా మృతిచెందినట్టు అధికారవర్గాలు తెలిపాయి. అయితే మరణాల సంఖ్య భారీగా ఉంటుందని పౌర సమాజం అంటున్నది.

ఏపీలో బలపడిన అల్పపీడనం

- నేడు వాయుగుండంగా మారే అవకాశం
- 27, 28 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు : ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ

అమరావతి : హిందూ మహాసముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం బలపడింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఈ నెల 25న దక్షిణ బంగాళాఖాతం మధ్య భాగాలపై వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు రోజుల్లో వాయువ్య దిశగా తమిళనాడు- శ్రీలంక తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందన్నారు. వాయుగుండం ప్రభావంతో ఈ నెల 27 నుంచి 30 వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల పంట పొలాల్లో నిలిచిన అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని, ఉద్యానవన పంట మొక్కలు / చెట్లు పడిపోకుండా నిలబడేందుకు కర్రలతో సపోర్టు అందించాలని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

'ఉక్కు'పై ప్రధాని స్పందించాల్సిందే...

గాజువాకలో ప్రజలు, కార్మికులు భారీ ప్రదర్శన, బహిరంగ సభ



విశాఖ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు విశాఖ నగరానికి రాకముందే ప్రధాని మోడీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విశాఖ ప్రజలు, కార్మికులు ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక, తిరిగి కొత్త గాజువాక నుంచి పాత గాజువాక కూడలి వరకూ నిర్వహించిన భారీ ప్రదర్శనకు స్థానికులు పూలుజల్లి ఎక్కడికక్కడ ఘనస్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలన్న నినాదాలతో గాజువాక పరిసరాలు మార్మోగాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు, మహిళా, రైతు సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రదర్శనకు, అనంతరం జరిగిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్మికులు హాజరయ్యారు.

మోడీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తేవాలి : సిహెచ్ నర్సింగరావు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించు కొనేలా ప్రధాన మంత్రి మోడీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తేవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కోరారు. ప్రదర్శన అనంతరం పాత గాజువాక కూడలిలో బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మహోన్నత ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకొని ప్రధాని తన పర్యటనలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు చేస్తోన్న పోరాటాన్ని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ అండతో దేశాన్ని కార్పొరేట్ శక్తులు కబళించాలని చూస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసిన అదానీపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టును అదానీ ఎలా లాక్కున్నారో అందరికీ తెలుసన్నారు. ఆ పోర్టు నుంచి 42 రోజుల పాటు స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రాక స్తంభించిన విషయాన్ని గుర్తు చేశారు.


'ఉక్కు' ఉద్యమానికి ప్రతి ఒక్కరి మద్దతు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

రాష్ట్రాభివృద్ధితోపాటు ఈ ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరి మద్దతూ ఉక్కు ఉద్యమానికి ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తెలిపారు. బహిరంగ సభలో వీరు మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విరమించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డిసిఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ప్రజా సంఘాల నాయకులు మణి, రెడ్డి వెంకటరావు, కుమార మంగళం, కెఎం.శ్రీనివాసరావు, రాంబాబు, ఎన్.రామారావు, రైతు సంఘం నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు సవాలుగా బైజూస్ దివాలా

- పెండింగ్ జీతాలు, బకాయిలతో ఇబ్బందులు
- కంపెనీ నుంచి అధికారిక సమాచారమూ లేదు
- ఉపాధ్యాయ, ఉద్యోగుల పరిస్థితి గందరగోళం
- విద్యార్థులు, తల్లిదండ్రులదీ అదే పరిస్థితి



న్యూఢిల్లీ : భారత్‌లోని వ్యాపారంలో, విద్యారంగంలో 'బైజూస్' అరంగేట్రం.. ఉన్నత విజయం.. ప్రస్తుతం ఎదుర్కొంటున్న దివాలా ప్రక్రియ.. ఇవన్నీ ఆసక్తిని కలిగించకమానవు. పోటీ ప్రపంచంలో అది ఉన్నతమై స్థానానికి ఎదిగిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. 2015లో ప్రారంభించబడిన లెర్నింగ్ యాప్ 'బైజూస్'.. 2018 నాటికే భారత తొలి ఎడ్యుటెక్ యూనికార్న్‌గా అవతరించి చరిత్ర సృష్టించింది. 2022 ఆర్థిక సంవత్సరం నాటికి అత్యధికంగా రూ.5,298 కోట్ల రూపాయలుగా ఉన్న బైజూస్ రెవెన్యూ.. ఆ తర్వాత పతనావస్థ స్థితికి చేరిందన్నది మార్కెట్ గణాంకాలు, విశ్లేషకుల మాట. ప్రస్తుతం బైజూస్ కంపెనీ.. సుప్రీంకోర్టులో దివాలా ప్రక్రియలను ఎదుర్కొంటున్నది. దీంతో ఆ కంపెనీ మీద ఆధారపడిన ఉద్యోగులు, సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరీముఖ్యంగా, ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకొని వచ్చినవారైతే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరు ఉద్యోగం లేకపోవటంతో తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు.

సంస్థ మీద ఆధారపడి ఇన్నేండ్లు పని చేసిన తమ లాంటి వారి పరిస్థితి దారుణంగా మారిందని, సంస్థ నుంచి కొన్ని నెలల జీతాలు తమకు రావాల్సి ఉన్నదని కొందరు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో తాము ఉద్యోగం లేకపోవటంతో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నామని చెప్తున్నారు. "నేను ముంబయిలోని బైజూస్‌లో టీచర్‌ని. ఈ ఎడ్యుటెక్ కంపెనీతో నేను రెండున్నరేండ్లుగా పని చేస్తునన్నాను. ఈ ఏడాది జనవరి వరకు అంతా సవ్యంగానే సాగింది. మేము షెడ్యూల్ ప్రకారం తరగతులు తీసుకుంటున్నాం. మా జీతాలు కూడా సమయానికి మా ఖాతాల్లో పడుతున్నాయి. ఇక అప్పటి నుంచి మాత్రం పరిస్థితి చక్కగా లేదు. ఫిబ్రవరి నెల జీతం నాకు పాక్షికంగానే అందింది. కానీ నా పేస్లిప్‌లో మాత్రం మొత్తం అమౌంట్‌ను చూపిస్తున్నది. అయితే, దీనిపై కంపెనీ నుంచి కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు. దీంతో నాతో పాటు చాలా మంది ఇతర ఉద్యోగులకు బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత మిగతా మొత్తాన్ని కంపెనీ విడుదల చేసినప్పటికీ.. మా జీతాల్లో జాప్యం ఒక స్థిరమైన సమస్యగా మారింది" అని ఒక టీచర్ వాపోయారు.

పిల్లల తల్లిదండ్రుల ఆందోళన

అటు బైజూస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులే కాదు.. ఇటు లక్షల్లో ఫీజులు కట్టిన పిల్లల తల్లిదండ్రులూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. " నా కొడుకు కోచింగ్ కోసం నేను రూ.2 లక్షలు చెల్లించాను. ఇప్పుడు, ఎలాంటి తరగతులూ జరగటం లేదు. ఎలాంటి అప్‌డేట్స్ కూడా లేవు" అని ఢిల్లీకి చెందిన ఒక విద్యార్థి తండ్రి.. తన కుమారుడి భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఏమీ తెలియని పరిస్థితి

దాదాపు రూ.15 వేల కోట్ల బకాయిల చెల్లింపు విషయంలో ఈ ఏడాది జులైలో బైజూస్‌పై దివాలా ప్రక్రియలు మొదలయ్యాయి. " అప్పటి నుంచి నాకు జీతం అందలేదు. ఆగస్టు 31 నాటికి చెల్లించని జీతాలు, ఇతర బకాయిల విషయంలో పత్రాలు సమర్పించాలని ఉద్యోగులను ఆదేశించారు. జీతాల చెల్లింపులు లేకపోవటంతో అనేక మంది టీచర్లు, ఇతర ఉద్యోగులు పని చేయటం ఆపేశారు. కానీ, నా ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ.. నేను ఆగస్టు 31 వరకు పని చేశాను. ఆగస్టు 20న బైజూస్ వ్యవస్థాపకులైన బైజూ రవీంద్రన్ ఉద్యోగులనుద్దేశిస్తూ భావోద్వేగ ఈమెయిల్‌ను పంపారు. ఇలాంటి ఆపత్కాల సమయంలో 'మోటివేట్‌గా ఉండాలి' అంటూ సందేశం పంపారు. అయితే, అలాంటి మోటివేషన్ మాత్రమే బిల్లులు చెల్లించవనీ, మా కుటుంబాలకు తిండి పెట్టవని కంపెనీ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. బైజూస్ కోసం మేము నిర్విరామంగా కష్టపడి పని చేశాం. అయితే, ఇప్పుడు మాకు మిగిలింది శూన్యమే. మేము మా కుటుంబాల్ని ఎలా పోషించుకోవాలి. మేము ఒంటరివారమయ్యాం. మా ఈ-మెయిల్‌లకు కంపెనీ నుంచి సమాధానం లేదు. సంస్థలోని ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేసినా.. ఫలితం లేదు. మా జీతాల విషయంలో కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక సమాచారమూ అందలేదు. ఇది ఎప్పుడు సద్దుమణుగుతుందో, ఎప్పుడు మా జీవితాలు సాధారణ స్థితికి చేరుకుంటాయో మాకు తెలియటం లేదు. ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు కట్టలేక చాలా మంది కష్టమైన స్థితిలో ఉన్నారు. దీంతో బతుకు బండి నెట్టటం కోసం మేము మా పొదుపు మొత్తాల నుంచి ఖర్చు చేయటం, రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి" అని సదరు టీచర్ వాపోయారు.

'ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి'

కంపెనీపై ఉన్న దివాలా ప్రక్రియను వేగవంతం చేయాలని కొందరు ఉద్యోగులు కోరుతున్నారు. "బైజూస్‌లో వేలాది మంది టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. నేను జీవనాన్ని సాగించటం కోసం ప్రయివేటు ట్యూషన్లు, ఫ్రీలాన్స్ వర్క్ మీద ఆధారపడుతున్నాను. అయితే, ఇది సుదీర్ఘ కాలం పని చేయదు. అయితే, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని, వెంటనే పరిష్కారం దక్కేలా చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం. గౌరవ సుప్రీంకోర్టు కూడా మా కష్టాలను గుర్తించి, బైజూస్‌పై న్యాయ ప్రక్రియలను వేగవంతం చేయాలని నేను అభ్యర్థిస్తున్నాను. ఇది వేలాది మంది ఉద్యోగుల జీవనానికి, లక్షలాది మంది విద్యార్థుల కెరీర్లకు సంబంధించిన అంశం" అని బైజూస్ టీచర్ తెలిపారు.



విజయోత్సవాలు ఇలా...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల వివరాలను సమాచార, పౌరసంబంధాల శాఖ వివరించింది. అభివృద్ధి, సంక్షేమమే విజయోత్సవాల లక్ష్యమనీ, వరుసగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉంటాయని తెలిపింది. ప్రజాపాలనను ప్రతిబింబించేలా తొమ్మిది రోజుల వేడుకల ఏర్పాట్లలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. డిసెంబర్ 1 నుంచి శాఖల వారీగా నిర్వహించే ప్రణాళికల్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాలకు భూమిపూజ నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. వీటికి వీటికి శంకుస్థాపన చేస్తారు. అలాగే డిసెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్‌అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది. వైద్యారోగ్య శాఖ పరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతోపాటు, 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పుతారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్ వాహనాలు అందుబాటులోకి తీసుకు వస్తారు. ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో క్లినిక్ ఏర్పాటు చేస్తారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సేవలను నియంత్రించేందుకు వాలంటీర్లుగా వీరి సేవలను వినియోగించుకుంటారు. గోషామహల్‌లో నిర్మించే ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనానికి భూమిపూజ చేస్తారు. ఆరాంఘర్ జూపార్క్ ఫ్లయ్‌ఓవర్‌ను, ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు మురుగునీటి శుద్ధి కేంద్రాలను (ఎస్టీపీ) ప్రారంభిస్తారు. కేబీఆర్ పార్కు సమీపంలో రూ.826 కోట్ల వ్యయంతో ఫ్లయ్‌ఓవర్లు, అండర్‌పాస్‌తో కూడిన ఆరు జంక్షన్ల పనులను ప్రారంభిస్తారు. హైదరాబాద్ శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాల్స్‌తో ఇందిరా శక్తి మహిళా బజార్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ ఫారెస్ట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ భవనానికి పునాది రాయి వేస్తారు. అటవీ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికల ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్గొండ ఏటీసీలను ప్రారంభిస్తారు. దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 237 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరగతులను ప్రారంభిస్తారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి భూమిపూజ చేస్తారు. ఐటీ, ఇండస్ట్రీస్ శాఖ అధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాటుతో పాటు పలు ఒప్పందాలు చేసుకుంటారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు.



మినీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మినీ అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు లక్ష్మి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కేటీఆర్‌ను కలిసి క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఈ ప్రక్రియ పూర్తిగా అమల్లోకి రాలేదని తెలిపారు. జనవరి నుంచి ప్రధాన అంగన్వాడీ టీచర్లతో సమానంగా రూ.13,650 వేతనాలు చెల్లించడం ప్రారంభించినప్పటికీ, మార్చి నెల నుంచి మళ్లీ పాత వేతనం రూ.7,800 మాత్రమే అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాలకు సంబంధించిన బకాయిలు సకాలంలో చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలను ప్రస్తావించి తగిన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు.

తప్పుగా చూపించిన జీపీఎస్

- నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి కారుపడి ముగ్గురు మృతి

లక్నో : జీపీఎస్ నావిగేషన్ మ్యాప్ తప్పుగా చూపించడంతో నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి కారు కింద పడింది. అందులో ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు బరేలీ నుంచి బదౌన్ జిల్లాలోని డేటాగంజ్‌కు కారులో వెళ్తున్నారు. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో ఖల్పూర్-దతాగంజ్ రహదారిపై ఆ కారు వేగంగా ప్రయాణించింది. నావిగేషన్ పొరపాటు వల్ల నిర్మాణంలో ఉన్న వంతెనపైకి ఆ కారు దూసుకెళ్లింది. వంతెన పైనుంచి కింద ఉన్న రామగంగా నదిలో అది పడింది. ఆ కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు.

తిరుపతిలో బాలికపై లైంగికదాడి



తిరుపతి : చాక్లెట్లు కొనిస్తానని చెప్పి ఏడేండ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన తిరుపతిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు... తిరుపతి ఎంఆర్ పల్లికి చెందిన బాలాజీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పది రోజులు క్రితం పక్కింటి బాలికను ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాక్లెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించాడు. అప్పటి నుంచి బాలిక కొంత నలతగా ఉండేది. శనివారం బాలికకు తీవ్ర కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అనుమానం వచ్చి బాలికను ప్రశ్నించడంతో యువకుడు తన పైన చేసిన అఘాయిత్యాన్ని వివరించింది. బాలిక తల్లిదండ్రులు ఎస్వి క్యాంపస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు బాలాజీని అదుపులోకి తీసుకొని పొక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

18 గంటల్లోనే..!



- సెకి ఒప్పందంపై అంతా హడావుడి
- ఫైల్‌కుఏపీ అప్పటి మంత్రి బాలినేని ఆమోదం

అమరావతి : సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)-అదానీ- రాష్ట్ర డిస్కంల మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం అనుమతులపై గత రాష్ట్రప్రభుత్వం కేవలం 18 గంటల్లోనే అనుమతి తీసుకుంది. అధికారికంగా చేయాల్సిన తంతు అంతా కూడా పూర్తిచేసిన రాష్ట్రమంత్రివర్గంలో ఆమోదించుకుంది. అయితే ఈ ఒప్పందంపై తాను సంతకం చేయలేదని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పినట్లు వార్తలు నిజం కాదని అప్పటి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. మంత్రివర్గ సమావేశానికి ముందే బాలినేని సెకి ఫైల్‌పై సంతకం చేశారని, ఆ తరువాతే మంత్రిమండలిలో ఆమోదం పొందిందని అంటున్నారు. సెకి ఒప్పందాలపై బాలినేని సంతకం చేశాకే మంత్రివర్గంలో చర్చించారని వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒంగోలులో ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.


(ఫైల్)

అసలు ఏం జరిగిందంటే

సెకి ప్రాజెక్టుపై పై నుంచి కింద వరకు అంతా గప్‌చుప్‌గా సాగిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన అనుమతులు మొత్తం కేవలం 18 గంటల్లోనే పూర్తయ్యాయి. రాష్ట్రంలో 10 గిగావాట్ల సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులకు 30ఏళ్ల పాటు ఉచిత విద్యుత్‌సరఫరా చేయాలని 2020 ఫిబ్రవరి 15న, జూన్ 15వ తేదిన అప్పటి ప్రభుత్వం విడివిడిగా ఉత్తర్వులు తీసుకొచ్చింది. ఈ మెగా సోలార్ పవర్ ప్రాజెక్టును తొలుత రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే 2021 సెప్టెంబర్ 12వ తేదిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గౌతమ్ అదానీ తాడేపల్లికి వచ్చి రహస్యంగా కలిసి వెళ్లారు. దీంతో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు కావాల్సిన మెగా సోలార్ పవర్ ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. అదానీ రాకతో సెకి నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయానికి కావాల్సిన సోలార్ విద్యుత్‌ను తాము అందిస్తామని వైఎస్ జగన్‌ను అదానీ కలిసిన మూడు రోజుల్లోనే అంటే సెప్టెంబర్ 15వ తేదిన సెకీ నుంచి రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. ఇందుకు తగ్గట్టుగా అన్ని అనుమతులను రాష్ట్రమంత్రివర్గంలో ఆమోదించుకునేందుకు అప్పటి ప్రభుత్వం హడావుడిగా ఈ తంతును పూర్తిచేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను సెప్టెంబర్ 16వ తేది జరిగే క్యాబినేట్‌కు సమర్పించాలని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంధన శాఖను ఆదేశించినట్లు తెలిసింది. సిఎస్ పంపిన అదే రోజు సాయంత్రం 3 గంటల సమయంలో ఇంధన శాఖ ఈ ఫైల్‌ను గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటేడ్(జిఈసిఎల్)కు పంపింది. జిఈసిఎల్ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన ఆమోదాన్ని తెలిపి ఇంధనశాఖకు తిరిగి పంపింది.

అక్కడి నుంచి ఆ ఫైల్ ఆర్థిక శాఖకు వెళ్లింది. అదే రోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన సమ్మతిని ఆర్థిక శాఖ తెలిపింది ఆ ఫైల్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇంధన శాఖ సెప్టెంబర్ 16వ తేది ఉదయం 7 గంటల సమయంలో పంపింది. 45 నిమిషాల్లో ఫైల్‌ను ఆమోదించిన సిఎస్ అప్పటి విద్యుత్ శాఖమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి సమర్పించారు. అదేరోజు ఉదయం 8 గంటలకు ఆమోదం తెలిపిన బాలినేని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సమర్పించారు. ఈ ఫైల్‌ను ఆ రోజు జరిగే మంత్రివర్గ సమావేశం ముందు ఉంచాలని సిఎం ఆదేశాలు చేశారు.

ఈ ఒప్పంద వివరాలు, అందరి అభిప్రాయాలను మంత్రివర్గంలో చర్చించాక ఈ ఫైల్‌ను మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. రైతులకు పగటి పూట 9గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయనున్న 10వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అప్పటి మంత్రివర్గ నిర్ణయాలను సమాచార శాఖమంత్రిగా ఉన్న పేర్ని వెంకటరామయ్య మీడియాకు వెల్లడించారు. సెకి నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.29లకే కొనుగోలు చేయగానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని, ఈ మేరకు సెకికి ప్రభుత్వం నుంచి లేఖ పంపుతామన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వీరమళ్ల రాంనర్సింహ గౌడ్ ఆదివారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత మహేశ్వరం నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితిని వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కేటీఆర్‌కు వివరించారు. లగచర్ల బాధితులు, మూసీ బాధితులతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు.

అమ్మదయ కాలనీలో చెట్ల నరికి వేత



నవతెలంగాణ-హయత్‌నగర్

రాను రాను వాతావరణంలో కాలుష్యం పెరిగిపోవడంతో నగరంలో మొక్కలను పెంచాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని సంవత్సరాల కిందట నాటిన చెట్లను గుర్తు తెలియని కొందరు వ్యక్తులు మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని అమ్మదయ కాలనీలో ఉన్న మూడు చెట్లను నరికి వేశారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని.. చెట్ల నరికి వేతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని సరూర్‌నగర్ మండల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ఆదివారం ఘనంగా నిర్వహించినారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని పాలిస్తున్న తరుణంలోనే భారతదేశంలో మొట్టమొదటి కార్మికుల యూనియన్ ప్రారంభించిందని గుర్తు చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాన్ని ఇంప్లిమెంట్ చేయాలి అన్నారు. సంఘటిత, అసంఘటిత ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి ఏఐటీయూసీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ కార్యదర్శి మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు శుక్రు నాయక్, ఆటో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, చిట్టి, మల్ల శంకరయ్య, టాటా ఏసియన్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నర్సింగ్, మల్లేష్, రాములు, శంకరయ్య, మున్సిపల్, ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ -దిల్‌సుఖ్‌నగర్

చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశం కల్పించాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుల గణన శాస్త్రీయ అవగాహన రాష్ట్ర సదస్సు ఆర్కేపురం డివిజన్ బీజేఆర్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..రాజకీయ సామాజిక చైతన్యం ద్వారానే బీసీలకు వాటా, అన్ని రంగాల్లో అవకాశాలు దక్కుతాయని అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కుల గణన జరిగితే బీసీల వాటా రాజ్యాంగ బద్ధంగా దక్కుతుందన్నారు. కుల గణన అనేది దేశాన్ని యూనిట్‌గా కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ఓసీలు ఇతర రాష్ట్రాల్లో బీసీలుగా, ఎస్సీలుగా ఉన్న వారు ఇతర రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్నారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా ఇంకా బీసీలు ఉద్యమ బాట పట్టడం దురదృష్టకరం అన్నారు.

1931లో చేసిన కుల గణన ఆధారంగా నేటికీ పాలకులు సంక్షేమ పథకాలు చేపడుతున్నారని మాజీ పార్లమెంటు



సభ్యులు ముధుయాస్కీ గౌడ్ వివరించారు. ప్రభుత్వాల దగ్గర పశువులు, పక్షులు, జంతువులు, చెట్లు వంటి వాటి లెక్కలు ఉన్నాయి కానీ..బీసీల జనాభా ఎంత ఉందో వివరాలు ఉండకపోవడం ప్రజాస్వామ్యానికి పరీక్ష లాంటిదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన కుల గణన దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్ జూలూరి గౌరి శంకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో బీసీల జనాభా ఎంత మంది ఉన్నారో వివరాలు ఉండకపోవడం దురదృష్టకరం



అన్నారు. బీసీలకు చట్టసభల్లోనూ, విద్య ఉద్యోగ అవకాశాల్లోనూ జనాభా ప్రాతిపదికన అవకాశం కల్పించడానికి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకటి రాజు కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాది చలకాని వెంకటేష్ యాదవ్, సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజు, వజీర్ ప్రకాష్ గౌడ్, గోర శ్యాం సుందర్ గౌడ్, గుంటి నగేష్, గుండా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన గోడపత్రిక అవిష్కరణ



నవతెలంగాణ-తుర్కయంజాల్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాదులో డిసెంబర్ ఒకటో తేదీన లక్షలాది మందితో జరిగే మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేరా బాలకిషన్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాల సంఘాల ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం మాలల సింహ గర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేర బాలకిషన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల రిజర్వేషన్ ఎత్తివేయాలనే కుట్రలో భాగంగా మనువాద మందకృష్ణను పావుగా వాడుకొని, తెలుగు రాష్ట్రాల్లో 59 ఉప కులాల మధ్య చిచ్చు రేపి మనువాదులు అల్లకల్లోలం సృష్టిస్తున్నారని ఆరోపించారు. మాల, మాదిగల మధ్య శాశ్వతంగా శత్రుత్వం పెంచడానికి మనువాదులు ఆడుతున్న నాటకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రహించాలని పేర్కొన్నారు. డిసెంబర్ ఒకటో తేదీన జరిగే సింహగర్జనకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున మాలలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మాజీ సర్పంచ్, సంఘం అధ్యక్షుడు చెవుల దశరథ, తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ కదారి శ్రీలత అనిల్ కుమార్, మాల బ్యాగరీ కాటికాపర్ల సంఘం నాయకుడు రవి శేఖర్, చెవుల నరేందర్, తావుల శ్రీనాథ్, తావుల శ్రీధర్, ఏర్పుల బాలరాజ్, శీలం అంగత్ కుమార్, శీలం భాస్కర్, దేవరకొండ కృష్ణ, దారా వెంకటేష్, కాలూరి జంగయ్య, బండి శ్రీనివాస్, బండి అనిల్ కుమార్, దేవరకొండ బాలరాజ్, చెవుల కార్తీక్, కలవండ సిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన

అనుమగల్ నూతన కమిటీ సభ్యులు



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ అనుమగల్ సంక్షేమ సంఘం నూతన కమిటీ స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఆదివారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కార్పొరేటర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

అనుమగల్ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప, అనుమగల్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెనిగె కుమార్ , ఉపాధ్యక్షులు గంగాని లక్ష్మయ్య, బోడ రవి, ప్రధాన కార్యదర్శి కాటేపాక నర్సింహ, సంక్షేమ సంఘం సభ్యులు జాయ ఈశ్వర్, పుడిగిల నర్సింహ, జెనిగె అశోక్, గుడ్డేటి అశోక్, సూరారం నాగరాజు, దుబ్బాక అశోక్, గంగాని రాము, జెనిగగె గోవర్ధన్, బోడ నర్సింహ, మహేష్, బస్తీ వాసులు తదితరులు ఉన్నారు.

లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి

- రెడ్ ఫ్లాగ్ నేతల డిమాండ్



నవతెలంగాణ-హయత్‌నగర్

కొడంగల్‌లో లగచర్ల రైతులపై ప్రభుత్వం పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎంఎల్‌పిఐ (రెడ్ ఫ్లాగ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆర్. సంతోష్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్‌లో లగచర్ల చుట్టుపక్కల గ్రామాల రైతుల భూములను అక్రమంగా లాక్కోవడం.. అక్కడ ఫార్మాసిటీని ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం భూ సేకరణను నిలిపివేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే పోరాటాల ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. డిసెంబర్ 13, 14, 15వ తేదీలతో పాటు హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో నిర్వహించే టీయూసీఐ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి ఖాసిం, సుధమల్ల భాస్కర్, మాన్యపు బుజందర్ తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-చంపాపేట్

వడ్డెర కులస్థుల సమస్యలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుంజి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి శివకృష్ణ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ బహిరంగ విచారణ కార్యక్రమంలో వీఆర్పీఎస్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంబీసీ రిజర్వేషన్ తొలగించారని అన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 50 ఏండ్లుగా ప్రభుత్వాలను వేడుకుంటు న్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం నేటి సమాజంలో ఇంకా పలు రకాల వివక్షలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి ఉపాధ్యక్షుడు బత్తుల ఉపేంద్ర, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల స్వామి, గ్రేటర్ యూత్ కన్వీనర్ గండికోట భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించండి

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఎల్బీనగర్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని నవంబర్ 30లోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని.. అందుకు ప్రజలంతా సహకరించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేలు విజయవంతంగా పూర్తి చేస్తున్నందుకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవరి ఇంటికైనా సిబ్బంది రానట్లయితే తమకు తెలియజేసినట్లయితే ఆయా ఇండ్లకు సిబ్బందిని పంపించే ఏర్పాట్లు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డిసెంబర్ 10 లోగా అన్ని జిల్లాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు కంప్యూటరీకరణ చేస్తారని, కొన్నిచోట్ల సర్వే పూర్తి కాకపోతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుటుంబాల వివరాలను సేకరిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్ని జిల్లాలలో 90% సర్వే పూర్తి అయిందని, రంగారెడ్డి జిల్లా అందులో ముందు ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే

అడ్డుపుల్లలు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-హయత్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అడుగడుగున అడ్డుపుల్ల వేసి అడ్డుకుంటున్నారని డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ మండిపడ్డారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై బీఆర్ఎస్ నేతలు హైకోర్టులో వేసిన కేసు కొట్టివేత తీర్పును స్వాగతిస్తున్నామని, బీఆర్ఎస్ నేతల చెంపచెళ్లుమనిపించేలా ఉందని వెంకటేష్ గౌడ్ అన్నారు. అనర్హతపై సర్వ అధికారం స్పీకరుకు ఉంటాయని కోర్టు తేల్చి చెప్పిందని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మేము ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని, ఇష్టానుసారం సంతలో పశువులను కొన్నట్టు ఎమ్మెల్యే, ఎంపీలను కొనుగోలు చేసింది మీరు కాదా అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రశ్నించాడు. ప్రభుత్వాలను నడిపించే పెద్దలకు పాలనపరంగా హుందాతనం ఉండాలని, ప్రభుత్వం నడపాలంటే పునర్నిర్మాణం కోసం ఫిరాయింపులు చేసుకోవచ్చని నిసిగ్గుగా అప్పుడు కేసీఆర్ మాట్లాడారని గుర్తుచేశారు. రెండుసార్లు ప్రజలు మంచి మెజార్టీతో గెలిపిస్తే.. పాలన చేతగాక ప్రతిపక్షం ఉంటే మా పప్పులు ఉడకవని ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యే, ఎంపీలనున కొనుగోలు చేసి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు ఎక్కడ పోయింది మీ సంస్కృతి అని బీఆర్ఎస్ నాయకులను నిలదీశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన దిశగా అడుగులు వేస్తు ముందుకెళ్తుందన్నారు. ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని రేవంత్ రెడ్డి.. రోజుకు 16 గంటలు పనిచేస్తూ, తమ సహచర మంత్రులతో పనిచేయిస్తు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారని వివరించారు. 100 రోజుల్లోనే 2లక్షల లోపు ఉన్న రైతుల రుణ మాఫీ చేసి చూపించిన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. టీచర్, పోలీసు కొలువులు, గ్రూపు1, గ్రూపు2, గ్రూపు3, ఉద్యోగ నోటిపికేషన్లు వేసి ప్రజా పాలన దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక ఈ బీఆర్ఎస్ నాయకులు అడుగడుగున అడ్డుపుల్ల వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఉద్యమకారులకు మ్యానిపెస్టోలో చెప్పిన విధంగా పూర్తిగా న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాలలో రాష్ట్రంలో ఎలాంటి సమస్యలు ఉన్న మీరు అర్జీపెట్టుకోవచ్చని, ప్రగతి భవన్ గోడలు బద్దలు కొట్టి జ్యోతిబాపూలే భవన్‌గా నామకరణం చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వం అని తెలిపారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ దాఖానం బందు కావడం కాయమని బిర్లా, రంగాలు చర్లపల్లి జైలుకు పోవడం ఖాయమని అన్నారు.

విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ-హాయత్ నగర్

అనుమానస్పద స్థితిలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న గడ్డం ఆంజనేయులు(20). బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్వే డేటా ఎంట్రీ తీరును పరిశీలించిన మేయర్





నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు సంబంధించిన డేటాను ఎంట్రీ చేస్తున్న తీరును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆదివారం కమిషనర్ పి.సరస్వతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమానికి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. కులగణన సర్వేతోనే రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లోనూ రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. విశ్వనాథ్ గార్డెన్ మియాపూర్‌లో తెలంగాణ శ్రీ వాసవి ఆర్య వైశ్య ఐక్య వేదిక, అదేవిధంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కెపి హెచ్చి కూకట్పల్లి మండల ఆర్య వైశ్య సంఘం, ధర్మపురి క్షేత్రం మధినగూడ మియాపూర్‌లో, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆలయం నిజాం పెట్‌లో, ఘట్ కేసర్‌లో ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రీస్ట్ ఫోరం, ఆర్య వైశ్య సంఘం మేడిపల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాలకు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఐవీఎఫ్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సరైన ధృవ పత్రాలు చూపించి..వాహనాలు తీసుకెళ్లండి

- ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు

నవతెలంగాణ-హయత్‌నగర్

సరైన ధృవ పత్రాలు చూపించి..వాహనాలు తీసుకొని వెళ్లాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ 61 ద్వీ చక్ర వాహనాలు ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ రకాల మోటార్ వాహనాలు నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడి ఉన్నాయని తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా వాటి యజమానులకు నోటీసుల రూపంలో పోస్ట్ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా పై జాబితాలోని వాహన యజమానులు, వాటికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించి, వాటిపై ఉన్న పెండింగ్ చలాన్లు చెల్లించి తీసుకెళ్లారని సూచించారు. లేని పక్షంలో చట్ట ప్రకారం నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందని, తగిన సమాచారం కోసం (8712662773)కు ఫోన్ ద్వారా గానీ, లేదా నేరుగా గానీ సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు సూచించారు.



ధర్నాను జయప్రదం చేయండి : శేఖర్ యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవ లంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిర సిస్తూ ఈ నెల 26వ తేదీన ఇంద్ర పార్క్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని రంగా రెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గం బాలాపూర్ మండలం సీఐ టీయూ కన్వీనర్ శేఖర్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆది వారం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ధనార్జన ధ్యేయంగా పనిచేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్, వీరన్న, సత్యం, అమ్ములు, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం నవంబర్ 25, 2024 www.navatelangana.com

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు చాలా అవసరం

● బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

చిన్నతనం నుండే విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన అవసరమని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని సహస్ర అకాడమీలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆయన సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించేలా విద్యా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమలత జంగారెడ్డి, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ నియోజకవర్గం కార్యదర్శి అన్వర్, సహస్ర అకాడమీ నిర్వాహకులు నరేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ శివాలయం ప్రధాన అర్చకులకు సన్మానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా టీం ఫౌండర్ తాడి ఫణి ప్రదీప్ రాజా ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ శివాలయం ప్రాధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహారాజ్‌ను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మారాం మహారాజ్ మాట్లాడుతూ ప్రధానంగా అర్చకులకు సన్మానము చేయడం పట్ల అర్చకులు సంతోషము వ్యక్తం చేస్తూ సురేష్ మహారాజ్‌కు హనుమాన్ చాలీసా టీం ఫౌండర్ తాడి ఫణి ప్రదీప్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరిలోని పురోహితులు, సన్నిహితులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ స్టేడియంలో వసతులు కల్పించాలి



● కార్పొరేటర్ బన్నాల గీతకు క్రీడాకారుల వినతి

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ అడిషనల్ కమిషనర్ యాదగిరిరావుకు ఉప్పల్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంటే అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డితో కలిసి స్టేడియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు మాట్లాడుతూ.. స్టేడియంలో మౌలిక వసతులకు ఏర్పాటుకు కృషి చేస్తానని, క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా చూస్తానన్నారు.

ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలి

● డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్.



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఈసీఐఎల్‌లో జిల్లా కార్యాలయంలో డీవైఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్స్, పరీక్షల నిర్వహణకు సంబంధించి అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలండర్‌ను ప్రకటించినా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. నిర్లక్ష్యం చేయకుండా నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ నియమకాలను చేపట్టాలన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. యూత్ డిక్లేరేషన్ హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. జూనియర్ లెక్చరర్ (జెఎల్) పోస్టుల భర్తీలో కొన్ని సబ్జెక్టులకు ఫలితాలను విడుదల చేసి మరికొన్నిటి సబ్జెక్టు ఫలితాలు ఎందుకు విడుదల చేయలేదన్నారు. ఉద్యోగాలు సాధించిన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రజా పాలన విజయోత్సవాలను జరుపుతున్న ప్రభుత్వం జేఎల్ అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూడురు శ్రీకాంత్, ముశ్యం కిరణ్, నాయకులు, సాయి, శ్రీనివాస్, చైతన్య, నర్సింగ్, నాగరాజు, పి.శ్రీను, పద్మ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పలు కాలనీల్లో కాప్రా కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి డివిజన్‌లోని నిర్మల్ నగర్‌లోని మహిళా భవన్‌లో నూతన బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. సప్తగిరి కాలనీలో పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు పరిశీలించారు. అనంతరం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ కాలనీ వాసులతో సమావేశమై కాలనీ సమస్యలు రోడ్ల నిర్మాణం, డ్రయినేజీ వ్యవస్థ సమస్యలు పరిష్కరి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్‌నగర్, సప్తగిరి కాలనీ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ కాలనీల రెసిడెంట్స్ అసోసియేషన్ల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, మల్లారెడ్డి, సంతోష్ చారి, రిజ్వాన్ ఖాన్, సత్యనారాయణ, జీహెచ్ఎంసీ జవాన్ కృష్ణ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

దుర్గా మల్లేశ్వరస్వామికి ఎమ్మెల్యే పూజలు



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలోని దుర్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ స్వామి వారి ఆశీస్సులు అందరి మీద ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం హంపి పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, నాయకులు మనెమ్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ ప్రారంభం



● మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి

నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాద్రి టౌన్షిప్ ఫేజ్-2లో రూ.70వేలతో నిర్మించిన 27మీటర్ల భూగర్భ డ్రయినేజీ మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ అభివృద్ధికి కాలనీవాసులు ముందుకు రావడం హర్షణీయం అన్నారు. మరి కొందరు దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కౌన్సిలర్ రవీందర్ గౌడ్, కాలనీవాసులు రవీందర్, శ్రీకాంత్ రెడ్డి, కటరం రాజశేఖర్, ఎం. రవీందర్, నవీన్, మనోజ్ కుమార్, ఆనంద్ చారి మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం సీపీఐ(ఎం) ఉద్యమం

● ఆరు గ్యారెంటీలు అమలుకు ప్రజలు ఐక్యం కావాలి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, ఎర్ర అశోక్

● సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల ఆరో మహాసభ

● మండల కార్యదర్శిగా సబిత ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-ఘట్కేసర్

అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజలు ఐక్యంగా కదిలి ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఎర్ర అశోక్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ఘట్కేసర్ మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల ఆరో మహాసభలు శ్రీకాంత్ రెడ్డి, కే చంద్రమోహన్ అధ్యక్షతన కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభ సూచకంగా సీపీఐ(ఎం) జెండాను కే. చంద్రమోహన్ ఎగురవేశారు. అనంతరం అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రవి. ఎర్ర అశోక్‌లు మాట్లాడారు. గడిచిన మూడేండ్ల కాలంలో పార్టీ, ప్రజా సంఘాల నిర్వహించిన కార్యక్రమాలపై మండల కార్యదర్శి ఎస్. సబిత నివేదిక ప్రవేశపెట్టారు. ఆ నివేదికపై హాజరైన ప్రతినిధులు చర్చించి పార్టీ అభివృద్ధి, విస్తరణకు పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన నిరంతరం పార్టీ పోరాటం చేయాలని, నివాస ప్రాంత సమస్యలపై, మహిళా సమస్యలపై, నిరుద్యోగ, సామాజిక సమస్యలపై పోరాటాలు చేయాలని మహాసభ పలు తీర్మానాలు చేసింది. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్. సృజన మహిళా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మండల కార్యదర్శిగా ఎస్.సబిత రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక

ఈ మహాసభల్లో సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల నూతన కమిటీ 8మందితో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎస్.సబిత రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కమిటీ సభ్యులు చింతల యాదయ్య, కళ్లెం శ్రీకాంత్ రెడ్డి, కొయ్యడ చంద్రమోహన్, ఎన్. ఉదయ్, కడమంచి యాదగిరి, నాగమణి, కే. అలివేల, ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం డిసెంబర్ 8, 9 తేదీలలో ప్రగతి నగర్ లో జరుగబోయే జిల్లా 3వ మహాభలకు మండలం నుండి ప్రతినిధులను ఎన్నుకున్నారు. మండలంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని, పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు.

విద్యుత్ కుంభకోణంలో అదానీని అరెస్టు చేయాలి

● ఆయన అక్రమాలకు సహకరించిన ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోస్



నవతెలంగాణ-కాప్రా

గౌతమ్ అదానీ, అతని సహచరులపై అమెరికన్ కోర్టులో 250 మిలియన్ల లంచం (2500 కోట్ల) విద్యుత్ అవినీతి కుంభకోణాలపై విచారణ జరిపించాలని, దేశ ప్రతిష్ఠతను దెబ్బతీసిన అదానీని అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్. బోస్ డిమాండ్ చేశారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ.. అదానీ గ్రూప్‌పై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని, అదానీ గ్రూప్ మురికి ముఖం ప్రజలకు తెలిసిందన్నారు. ఆర్థిక అవకతవకలు, ఉల్లంఘనలను సూచించే అభియోగాలు, జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందన్నారు. మోడీ-అదానీ అనుబంధం దేశానికి తీవ్ర ముప్పని, సామాన్య ప్రజానీకం ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మోడీ అధికారం చేపట్టిన తర్వాత అదానీ సంపద అనేక రెట్లు పెరిగిందన్నారు. గతంలో అదానీ అంశంలో హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను కూడా వాస్తవమేనని గుర్తు చేశారు. కార్పొరేట్ దురాశ, రాజకీయ శక్తి ప్రమాదకరమైన ఖండనను బహిర్గతం చేస్తుందన్నారు. ఇది అదానీ వంటి వ్యక్తులను శిక్షార్హతతో పని చేయడానికి అనుమతించిందన్నారు. ఈ లంచం కుంభకోణం అదానీ ప్రతిష్ఠను మరింత దిగజార్చిందన్నారు. ఈ అంశంలో మోడీ పాత్రను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. అదానీ అనైతిక వ్యాపార విధానాలపై జేపీసీ డిమాండ్‌ను బీజేపీ ఆధ్వర్యంలోని క్రోనీ క్యాపిటలిజం పూర్తి స్థాయిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో సెబీ వంటి నియంత్రణ సంస్థల పాత్ర దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైందనే ప్రశ్నలను లేవనెత్తిందన్నారు. అదానీ గ్రూపునకు ఇచ్చిన కాంట్రాక్టులు, ప్రాజెక్టులన్నీ వెనక్కి తీసుకోవాలని, తక్షణమే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి నేతలు నారా నర్సింహా, సుధాకర్, మోహన్, స్వామిదాస్, మిరియాల సాయిలు, నారాయణ, ప్రదీప్ పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ఇన్‌క్లూజన్ సదస్సు



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలో శనివారం IEEE WIE కాంగ్రెస్ 2024 అనురాగ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఆదివారం IEEE WIE కాంగ్రెస్ 2024 సమావేశం హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం అన్వేషించడానికి 'ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్ అండ్ సస్టైనబిలిటీ" థీమ్. ఈ మహాసభకు వివిధ కళాశాలల నుంచి 180 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. అనురాగ్ విశ్వవిద్యాలయం IEEE హైదరాబాద్ విభాగం ఉమెన్ ఇంజనీరింగ్ అఫినిటీ గ్రూప్ WIEcongress 2024 ఫ్లాగ్‌షిప్ ఈవెంట్‌ను "ఇన్నోవేషన్ ఇన్‌క్లూజన్ అండ్ సస్టైనబిలిటీ" కార్యక్రమానికి డాక్టర్ సమీన్ ఫాతిమా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూపర్‌మ్యాన్ ప్రపంచంలోని సూపర్ ఉమెన్‌లపై సెషన్ ఇచ్చారు. WE హబ్ నుండి వచ్చిన అన్నీ విజయ డైరెక్టర్ తదుపరి కీలక సెషన్‌లో WE హబ్ నుండి ఉద్యోగాలు మరియు అవకాశాలకు మించిన వ్యవస్థాపక మనస్తత్వం గురించి వివరించారు. ఫౌండర్, సీఈవో ఇన్నిసినో టెక్‌కి చెందిన సౌరవ్ కర్మాకర్ తదుపరి నిపుణుల ప్రసంగం రోబోటిక్స్‌లో సుస్థిరతను అందించింది. ఆ తర్వాత గ్రీన్ ఫ్యూచర్‌లో ఆవిష్కరణలపై మణికాంత్ ఐ మేనేజర్ నుండి గ్రీన్ ఫ్యూచర్‌లో ఆవిష్కరణలపై సెషన్, సైబర్ సెక్యూరిటీ ఎసెన్షియల్‌లపై మహేష్ నెరటి తదుపరి సెషన్ అనురాగ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అర్చన మంత్రి, డబ్ల్యుఐఈ హైదరాబాద్ సెక్షన్ చైర్ హరివర్ధగిని, హైదరాబాద్ సెక్షన్ చైర్ విజయ లత, డీన్లు ప్రొఫెసర్ వి.విజయ కుమార్, ప్రొఫెసర్ జి.విష్ణుమూర్తి, డబ్ల్యుఐఈ సలహాదారు శ్రీమతి దుర్గా భవాని, కౌన్సెలర్ డా.సంతోష్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైవిధ్యాన్ని పెంపొందించడం, ఆవిష్కరణలను నడిపించడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంలో శక్తి, నిబద్ధతకు సాక్ష్యమివ్వడం హృదయపూర్వకంగా ఉందని పాల్గొనేవారు వ్యక్తం చేశారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో ఎదగాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థినులు అన్ని రంగాల్లో ఎదిగి అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉప్పల్ డిపో పరిధిలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ మహిళా సదస్సులో మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యార్థినుల విద్యపట్ల సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలం చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు విద్య పట్ల ఆసక్తి కనబర్చడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలే అన్నారు. బాలికలు నేడు సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు విద్యాపరంగా, ఆర్థిక పరంగా, సామాజికంగా, రాజకీయపరంగా ఉన్నత స్థానాలు అధిరోహించాని సూచించారు. ప్రభుత్వాలు బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యాసంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలిపారు. ఆత్మహత్యలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కుల విషయం ప్రశ్నించడం కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్,హైకోర్ట్ లీగల్ అడ్వైసర్ షేక్ యూసుఫ్, శ్రీనారాయణ కళాశాల కరెస్పాండెంట్ మధుకర్, వినయ్, ప్రియాంక, ప్రవళిక, సంధ్య లక్ష్మి ప్రసన్న, హరిణి, సుజాత పాల్గొన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా నూతన బాలికల కన్వీనర్ కౌన్సిల్ ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా భూషరాజు శృతి, కోకన్వీనర్, వడపర్తి శరణ్య, కోకన్వీనర్‌గా శిరీషలను ఎన్నుకున్నారు.

వైభవంగా పుష్కర కుంభాభిషేకం బ్రహ్మోత్సవాలు

-ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



నవతెలంగాణ-శామిర్‌పేట

శామీర్ పేట్ మండలం అలియాబాద్ చౌరస్తాలోని శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేకం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ వ్యవస్థాపకులు పల్లె జ్యోతి రాములు గౌడ్ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య పూజాది కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రారంభ పూజ చేశారు. భక్తులు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, మాజీ జడ్పీటీసీ అనిత లాలి, మాజీ సర్పంచ్ గురక కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ బి.నర్సింహా రెడ్డి, తాళ్ల జగదీష్ గౌడ్, వంగ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడుతా..

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..



నవతెలంగాణ - చర్లపల్లి

వీరశైవుల అభ్యున్నతికి తోడుపడతానని, సామాజిక భవనం నిర్మించేందుకు సహకరిస్తానన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా వీరశైవ సమాజం అధ్యక్షులు ప్యాట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన సమారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం వాసవీ శివానగర్‌లోని కన్యకా పరమేశ్వరి శివాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడతానన్నారు. చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, చర్లపల్లి కాలనీల సమైక్య అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం ప్రసాద్, కంటెస్టెంట్ కార్పొరేటర్ మెమూరి మహేష్ గౌడ్, బిజెపి నాయకులు మర్రి మోహన్ రెడ్డి, రమేష్ యాదవ్, సహస్ర లింగేశ్వర ఆలయం అభివృద్ధి కమిటీ మెంబర్ శివ, ఎంఈఓ శశి కుమార్, కొప్పునూరు రాజేష్, సమాజం ప్రధాన కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, కత్తి శివానంద్, మస్కురి శివ, జంగం శంభు లింగం, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం ఒక్కటయ్యాం



● సమస్యల పరిష్కారమే సీసీఎస్ లక్ష్యం

● ఎంపల్లి పద్మారెడ్డి

● కాలనీ సంఘాలతో సీసీఎస్ సమావేశం

నవతెలంగాణ - చర్లపల్లి

గడిచిన నాలుగేళ్లుగా చర్లపల్లి కాలనీల సమాఖ్య (సీసీఎస్) పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి, తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంపల్లి పద్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కాలనీ సంఘాల సభ్యులు ఒక్కటై సీసీఎస్ వేదికను శివసాయినగర్ కాలనీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. చర్లపల్లి కాలనీ సంక్షేమ సంఘం పేరుతో, అధికారికంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ పరిష్కారానికి బాటలు వేయబో తున్నారు. ఈక్రమంలో సీసీఎస్ గ్రూప్‌లో ప్రజలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరితే బెదిరింపులకు సైతం పాల్పడ్డారనే అభిప్రాయాలను సమావేశంలో వాపోయారు. ఇకపై బెదిరింపులు, అడ్డంకులు ఎదురైనా, సమస్యలు పరిష్కారం చూపే వరకు సీసీఎస్ ఐక్యత, పోరాటం ఆగేది లేదన్నారు.

చర్లపల్లి కాలనీల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడిగా ఎంపల్లి పద్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా సురకంటి సత్తిరెడ్డి, గంపకృష్ణ, శ్రీనివాస్ నాయక్, కటుకూరి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈగ ఉమారాణి, కోశాధికారి సింగిరెడ్డి నరసింహారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెంకట నరసింహారెడ్డి, యావపురం రవి, సారా వినోద్, కార్యవర్గం సభ్యులుగా లంక దాసరి సుధాకర్, పెంటేష్ లు ఎన్నికయ్యారు.



కష్టాల్లో ఉన్న వారికి అండగా పిట్టల నాగరాజు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కష్టాల్లో ఉన్నవారికి తోడుగా ఉంటూ మానవత్వంతో పేదవారికి తనకు తోచిన సహాయం చేస్తూ చాటి వారికి వినాయక్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనంపల్లి అభిమాని పిట్టల నాగరాజు ఆదర్శంగా నిలుస్తున్నాడు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మనమడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తనయుడు క్రియాన్స్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మౌలాలి డివిజన్ సాయినాథపురంలో నివాసముండే నిరుపేద కుటుంబానికి చెందిన ఆజీబేగం అనారోగ్యంతో హెకా రెహబ్ హాస్పిటల్ లో ట్రీట్‌మెంట్ తీసుకుంటన్న విషయాన్ని తెలుసుకొని ఆమె బ్రైన్ ఆపరేషన్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని స్ఫూర్తిగా తీసుకోని, ఆపదలో ఉన్న పేదవారికి తోచిన సహాయం చేస్తున్నామని తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ కొంతైన సహాయం చేసి, ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో పి ఎన్ ఆర్ గ్రూపు సభ్యులు పాండు రంగాచారి, తదితరులు పాల్గొన్నారు.



నూతన బోర్ డ్రిల్ ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ అధ్యక్షులు టీటీకె శ్రీనివాస్ వినతి మేరకు.. కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి సహకారంతో నూతన బోరు డ్రిల్ మంజూరు చేయడం జరిగింది. ఆదివారం బోర్ డ్రిల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా 130 డివిజన్ మాజీ కార్పొరేటర్ హాజరయ్యారు. ఎస్ఆర్ నాయక్ నగర్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కమిటీ సభ్యులు సురేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఎర్రబెల్లి సతీస్ రావుని కలిసిన కాలనీ వాసులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ వాంబే కాలనీ నివాసులు, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావుని కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు.

సర్వే డేటా ఎంట్రీ కీలకమైనది

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు
- డోర్ లాక్, వలస వెళ్ళిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్‌తో వీసీ ద్వారా సమీక్ష





నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందనీ, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందనీ, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి డిప్యూటీ సీఎం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో మేడ్చల్-మల్కాజిగిరి నుంచి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సర్వే డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందనీ, ప్రభు త్వం ఈ అంశంపై దష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తడంతో వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజే యడం ద్వారా ఆ వివరాలను క్రమ బద్ధకరించుకోవాలనీ, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలని తెలిపారు. కొన్ని వసతి గహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతు న్నాయనీ, ఈ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందనీ, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచి ందని తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సీపీఐ(ఎం) మూడవ జిల్లా మహాసభలు స్టిక్కర్ ఆవిష్కరణ..



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతి నగర్ లో లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్ వేదికగా మేడ్చల్ జిల్లా సీపీఐ(ఎం) మూడో మహాసభలు డిసెంబర్ 7, 8 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా.. ఆదివారం ప్రచార స్టిక్కర్ ఆవిష్కరణ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ వద్ద ఆటోకి అంటించి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకటరామ య్య మాట్లాడుతూ సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభలు ఉపయోగ పడతాయన్నారు. స్థానికంగా ఉన్న స్మశాన వాటిక మౌలిక సదుపాయాలు సరిగా లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక స్మశాన వాటిక అభివృద్ధి కోసం కృషి జరుగుతుందన్నారు. అదేవి ధంగా చెరువు కాలుష్య కారంగా మారిందని కాలుష్య రహిత చెరువుగా సుందరీకరించడానికి సీపీఐ(ఎం) పార్టీ కృషి చేస్తుందన్నారు. అదేవిధంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధి కోసం మహాసభల్లో కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు ఎం చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు స్థానిక నాయకులు సుధాకర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస వనభోజన మహోత్సవం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆదివారం పలు కుల సంఘాలు ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమలకు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శెట్టి బలిజ సంక్షేమ సంఘం, శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం, తెలంగాణ రాష్ట్ర బట్ట రాజుల సంఘం, కాపు సేవ సమితి, కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం, భాగ్యనగర్ కొప్పుల వెలమ సంఘం వారు వేరు వేరుగా ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు కుల సంఘాలు ఏర్పాటు చేసిన వన భోజన ఉత్సవాల్లో పాల్గొనడం సంతో షంగా ఉందన్నారు. సంక్షేమ సంఘాలతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొంటున్నారని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంక్షేమ సంఘాల, కుల సంఘాల నాయకులు, పెద్దలు, కుల సంఘాల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ప్రకృతి వనభోజనాలు పర్యావరణ పరిరక్షణలో సామూహిక భోజనం : ఆవుల రవీందర్ రెడ్డి..

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన కార్తీకమాస వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం జేఏసీ అధ్యక్షులు అప్పల రామిరెడ్డి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామూహికంగా కలసి చేసిన ఇష్టకరమైన వంటకాలతో రుచికరమైన వంటకాలతో భోజనం చేస్తారు. అంతేకాకుండా అంతరించిపోతున్న ప్రాచీన సాంప్రదాయ ఆటలకు సమాన వేదిక ఈ 'వనభోజనాలు' అన్నారు. ఈ ఆట పాటల్లోనే కొత్త స్నేహాలు, కొత్త పరిచయాలు కలుగుతాయన్నారు. ఈ కార్తీక వనభోజన ప్రదేశాన్ని మించిన గొప్ప ఈ ప్రపంచంలో మరొకటి లేదని కార్పొరేటర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఉపేందర్ రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులు రెడ్డి బంధు మిత్రులు హాజరైయ్యారు.

కార్తీక వన భోజనాల్లో కార్పొరేటర్ దంపతులు..

కూకట్‌పల్లి: కార్తీక మాసం సందర్భంగా.. వీర శైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో.. పాత శివాలయం కూకట్‌పల్లిలో 9వ సామూహిక ఉమామహేశ్వర వ్రతాలు, శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్‌లో శేషాద్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన, కార్తీక వన భోజన కార్యక్రమంలో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు, ఆనందం, ఆరోగ్య సందేశం కార్తిక వనభోజనాలు మనకు అందిస్తాయని అన్నారు. దేశ సంస్కృతి సాంప్రదాయాలు, హైందవ సాంప్రదాయాలను అనుసరిస్తున్నాము. ఆయుర్వేదిక శాస్త్రం ప్రకారం మంచు కురిసే వేళలో ఉసిరి చెట్టు కింద భోజనాలు వండుకొని ఆరగించడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారని అన్నారు.



కాపు కులస్తులకు అండగా ఉంటా..



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాపు కులస్తులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం కార్తీక మాసం పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో 27 వ కార్తీకమాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వనభోజన వేడుకలు ఐకమత్యానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గం లోని సూరారం ప్రాంతంలో 266 చదరపు గజాల స్థలాన్ని కాపు సేవా సమితి సంఘ భవనానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ ప్రాంత కాపు కులస్తులకు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం కులపెద్దలు,కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంకు విశ్రాంత డైరెక్టర్ పరసా పరమేశ్వర్ రావుబిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మిర్యాల రాఘవరావు, హైకోర్టు అడ్వకేట్ సుంకరి దిలీప్, తెలంగాణ కాపునాడు అధ్యక్షులు, దేవాదాయ శాఖ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంధం కరుణాకర్ నాయుడు, సంఘపెద్ద డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్, అడపా భాస్కరరావు కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి ప్రతినిధులు పక్కాల దుర్గారావు, గౌరీశెట్టి శివఈశ్వర్ రావు, పసుపులేటి సత్యనారాయణ, యతెలుగశెట్టి బాల పరమేశ్వరరావు కోనేటి సత్యనారాయణ, సత్తి ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తా..



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామం అనుకొని ఉన్న 60 గజాల వీర హనుమాన్ కాలనీ వాసులు గత కొని సంవత్సరాలుగా రోడ్డు వసతి లేక తీవ్ర ఇబ్బంది పడుతునం అని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హన్మంత రెడ్డి స్పందిస్తూ .. పైఅధికారులుతో మాట్లాడి వీలైనంత తొందరగా రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. రోడ్డు నిర్మాణానికి సంబంధిత అధికారులను కాలనీ ప్రాంతానికి వెళ్లి నివేదిక ఇవ్వాల్సిందని ఆదేశించారు. దాశబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం లభిస్తుండడంతో వెంచర్ యజమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జీవెందర్ రెడ్డి, మాజీ పీఏసీ ఎస్ అధ్యక్షులు బెంబిడి మల్ల రెడ్డి, మాజీ కౌన్సిలర్ సురేష్ బాబు కాలనీ వాసులు కట్టా మహాలక్ష్మి, సాయిరాం, టి.రమేష్, బట్టు విక్రమ్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జీకే డ్రైవ్ ఇన్ ఫుడ్ కోర్ట్ ప్రారంభం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలోని నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన జీకే డ్రైవ్ ఇన్, ఫుడ్ కోర్ట్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని నాణ్యతమైన ఆహారాని ప్రజలకు అందించాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళి యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు తిరుమలేష్, భిక్షపతి, జి.మల్లేష్, కుంట్ల నందు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాల మహోత్సవంలో కోలన్ హన్మంత్..



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ శెట్టి బలిజ కార్తీక మాస వన భోజనాల మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ రెడ్డి కార్తీక మాస వన భోజనాల మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పలు వనభోజన కార్యక్రమంలో కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవాసమితి (కేకేఎస్-ఎస్) వారి ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లి చిత్తారమ్మ గుడి ప్రాం గణంలో నిర్వహించిన... 33వ కార్తీక వనభోజన మహో త్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు.దీపారాధన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కార్తీక మాసం వనభోజనాలు సందర్భంగా.. ఆత్మీయులందరిని ఒకే వేదిక మీద కలవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పి.గాంధీ సుబ్బారావు, పి.మురళి కృష్ణ, యు.మునే శ్వరరావు, డి.విష్ణు మూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గవర కులస్తుల వనభోజనాలు..

కార్తీక మాసం సందర్భంగా గవర కులస్తుల వన సమారాధన, ఆత్మీయ కలయిక కార్యక్రమం పటేల్ కుంట పార్క్ వద్ద ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ న్యాయమూర్తి వేగి సూర్య అప్పారావు, పారిశ్రామిక వేత్త ఆడారి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, గవర సంఘం అధ్యక్షులు దాడి శ్రీను, ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి వెంకటేశ్వరరావు, షౌకత్ అలీ మున్నా, మజర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గోకుల యాదవ సంఘం వనభోజన ఉత్సవాలు..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గోకుల యాదవుల సంక్షేమానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని గోకుల యాదవ సంఘం కుత్బుల్లాపూర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక మాస వనభోజన మహోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎల్.వెంకట్రావు యాదవ్, గౌరవ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్, గౌరవ సలహాదారులు వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.తిరుమల రాజ్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఆయన చేతులు మీదుగా కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన సిహెచ్ నాగేశ్వర రావుకి ముఖ్యమం త్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన.. రూపాయల ఒక లక్షా యాభై వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

భట్రాజు కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భట్రాజు కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి నల్లగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో భట్రాజు సంఘం మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ శాఖల ఆధ్వర్యంలో.. ఏర్పాటుచేసిన 21 వ వనభోజన మహోత్సవ వేడుకలకు ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు వేరువేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడోసారి ఈ నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తన గెలుపునకు భట్రాజు కులస్తులు కీలక భూమిక పోషించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భట్రాజుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని ఈ ప్రాంత కులస్తులకు తన వంతు సహాయ సహకారాలు అందజేయడంతో పాటు సంఘ భవనానికి తన వంతు సహాకారం అందజేస్తానని తెలిపారు. అనంతరం టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ ఉడుమూడి రాఘవరాజు వారి తల్లిదండ్రుల వివిఎల్ఎన్. రాజు,శారద దంపతులు జ్ఞాపకార్థం, పోరంకి నాంచార్రాజు వనజకుమారిల జ్ఞాపకార్థం వారి కుమారుడు కృషి హై స్కూల్ అధినేత పోరంకి శ్యాంప్రసాద్ రాజు ఇంటర్ ఇంటర్‌తో పాటు పై చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కమిటీ సభ్యులతో కలిసి నగదు పురస్కారాలను అందజేశారు. ఆ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పండితులుగా, విద్వాంసులుగా స్థిరపడ్డారని తమ కులస్తులు కూడా సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. తమను అన్ని రంగాలలో ప్రభుత్వం గుర్తించి సరైన ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. అనంతరం వివాహ పరిచయ వేదికతో పాటు మహిళలకు పలు క్రీడలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యా ఉపాధి కమిటీ చైర్మెన్ కేశిపెద్ది నరసింహరాజు, వ్యవసాయ యూనివర్సిటీ సైంటిస్ట్ దామోదర్ రాజు, భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు, మహిళా ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం సావిత్రి యువజన విభాగం అధ్యక్షులు కూరపాటి నరసింహరాజు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోలబట్టు కృష్ణంరాజు, రాష్ట్ర ప్రతిని ధులు చక్రాల రేవతి నంద్ భట్, నియోజకవర్గ అధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ భట్, కమిటీ సభ్యులు కూరపాటి శ్రీ రామరాజు, సరస్వతి నరేందర్ రాజు, పాల్గొని సందడి చేశారు.

అనాథలు నిరాశ్రయులను ఆదుకోవాలి

- స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల లో రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌ల మీదనే జీవనం సాగిస్తున్నా అనాథలు, నిరాశ్రయులను ఆదుకోవాలని స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 265వ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు అఖిల్, ఇర్ఫాన్, హరీష్, సాయితేజ, నేహా పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



నవతెలంగాణ-ముషీరాబాద్

క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బాగ్ లింగంపల్లిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూంలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ దేవేందర్ నాయక్ కుమారుడు జరుపుల శివా నాయక్ వరల్డ్ కోకో పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆధ్వర్యంలో శివా నాయక్ను కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన గిరిజన బిడ్డ శివా నాయక్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. శివా నాయక్‌కు తమవంతు సహకారం అందిస్తా మని తెలిపారు. శివానాయక్ తండ్రి దేవేందర్ నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సహకారంతో నేడు తన కుమారుడు వరల్డ్ కోకో పోటీలకు ఎంపికయ్యాడని సంతోషం వ్యక్తం చేశారు. సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు వడిత్య కల్యాణ్ నాయ్, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పత్రికలు, ఛానళ్లు ప్రజల పక్షాన నిలవాలి'

వీ-3 న్యూస్ ఛానల్ 6వ వార్షికోత్సవ సభలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పత్రికలు, ఛానళ్లు ఏ రాజకీయ పక్షం కొమ్ముకాయకుండా ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకగా మారాలని శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అభిప్రాయపడ్డారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో వీ-3 న్యూస్ ఛానల్ 6వ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వంభర టీవీ ఛానల్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో వీ-3 న్యూస్ ఛానల్ చైర్మన్ కాచం సత్యనారాయణ అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన చేపట్టిన ఏ కార్యక్రమమైన సక్సెస్ చేస్తారని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా వీ-3 ఛానల్‌ను నడుపుతున్నారన్నారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఒక ఛానల్‌ను నడపడం ఎంత కష్టమైన పనో తనకు తెలుసునని, తాను ఓ ఛానల్ నడిపానన్నారు. 6 ఏండ్లుగా వీ-3 న్యూస్ ఛానల్ ను విజయవంతంగా నడపడం కాచం వల్లే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం మనల్ని మనకు పరిచయం చేసిందని, మన గురించి ప్రపంచం ఆలోచించేలా చేసిందన్నారు. మీడియా రంగంలో ఆంధ్రా వారి పెత్తనం కొనసాగిన తరుణంలో తెలంగాణ వారి నుంచి పత్రికలు, ఛానళ్లు రావాల్సిన అవసరం కనిపించిందన్నారు. ఉద్యమం సమయంలో వచ్చిన పత్రికలు, ఛానళ్లు భావ వ్యాప్తికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వాటిలో కాచం సత్యనారాయణ ప్రారంభించిన వీ-3 న్యూస్ ఛానల్ ఎంతో ముఖ్యమైందని, రాజకీయాలకు అతీతంగా దీన్ని నడిపారన్నారు. విశ్వంభర దిన పత్రికను విజయవంతంగా తీసుకొస్తున్నారని, కొత్తగా విశ్వంభర ఛానల్‌ను ప్రారంభించడం అభినందించదగ్గ విషయమన్నారు. అరుణోదయ విమలక్క మాట్లాడుతూ జర్నలిజం అంటే వాస్తవమన్నారు. సోషల్ మీడియా ఎంత అభివృద్ధి చెందిన పత్రికలను తప్పక చదవాలన్నారు అందుకోసం గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. వీ-3 న్యూస్ జనం పక్షాన నిలబడి వార్తలు అందిస్తున్నారన్నారు. వీ-3 న్యూస్ ఛానల్ చైర్మన్ డా.కాచం సత్యనారాయణ మాట్లాడుతూ 6ఏండ్లుగా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రాజకీయాలకతీతంగా ప్రజల పక్షాన నిలబడ్డామన్నారు. ఇక ముందు అలాగే కొనసాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ కన్వీనర్ డా.సుధాకర్, వీ-3 ఛానల్, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, విశ్వంభర దినపత్రిక అసోసియేట్ ఎడిటర్ రావికంటి శ్రీనివాస్, వీ-3 న్యూస్, విశ్వంభర దినపత్రిక బ్యూరో చీఫ్ పోతుగంటి వెంకట రమణ, వీ-3 న్యూస్ కరస్పాండెంట్లు ఏలే మహేష్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మా ఇల్లు బఫర్‌జోన్‌లో లేదు



- హైడ్రా కమిషనర్ రంగనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తన ఇల్లు విషయంలో వస్తున్న వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. మధురానగర్‌లో తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. 44 ఏండ్ల క్రితం మా నాన్న నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నామని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఒకప్పటి పెద్ద చెరువునే 25 ఏండ్ల క్రితం కృష్ణకాంత్ పార్కుగా మార్చారు. కృష్ణకాంత్ పార్కుకు మా ఇంటికి మధ్య వేలాది ఇండ్లు ఉన్నాయని చెరువు కట్టకు దిగువన 10మీటర్ల దాటితే బఫర్ జోన్ పరిధిలోకి రావు. మాఇల్లు చెరువు కట్టకు దాదాపు కిలోమీటర్ దూరంలో ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.



ఒగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య



నవతెలంగాణ-కల్చరర్

తెలంగాణ గడ్డ కళలకు ఎన్నో కళా రూపాలు వైభవంగా వెలుగు చూసిన నేల పై ఒగ్గు కళా రూపం అపురూపమని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఒగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య అని ఆయన పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా చుక్కా సత్తయ్య యాదిలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొని మాట్లాడుతూ అక్షరం ముక్క రాకున్నా జాతీయ అంతర్జాతీయ స్థాయి కి ఒగ్గు కథను నిలిపిన చుక్కా సత్తయ్యకు పద్మ అవార్డు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఆయన ఉంటే తప్పక దక్కేదన్నారు. ప్రధాన ప్రసంగం చేసిన రచయిత్రి శైలజ మిత్ర ప్రతిభకు చదువుతో నిమిత్తం లేదని నిరూపించిన చుక్కా సత్తయ్య పలు విశ్వవిద్యాలయాల నుంచి సత్కారాలు పొందారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కళా పోషకుడు పీఎస్ఆర్ మూర్తి , సంఘ సేవకుడు పి. వెంకట రావు పాల్గొన్నారు.

'సిరివెన్నెల' పరిపూర్ణ మానవతా అమరమూర్తి

- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సిరివెన్నెల సీతారామశాస్త్రి పరిపూర్ణ మానవతా అమరమూర్తి అని హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. విశ్వనాథ సాహిత్య పీఠం ద్విశతాబ్ది ఉత్సవాలలో భాగంగా అమీర్‌పేటలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో 'సిరివెన్నెల' సోదరుడు చేంబోలు శ్రీరామశాస్త్రి రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో...(సంక్షిప్తం)' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ సీతారామశాస్త్రి సోదరుడు మనందరికన్నా ఆయన జీవితాన్ని దగ్గరగా చూసిన వ్యక్తి అని, శ్రీరామశాస్త్రి రచించిన ఈ పుస్తకం ద్వారా సిరివెన్నెల స్ఫూర్తివంతమైన జీవితాన్ని సమాజానికి మరింత లోతుగా పరిచయం చేయడం గొప్ప విషయమన్నారు. సులభతరమైన సాహిత్యంతో పండిత పామరులను సైతం ఈ పుస్తకం ఆకట్టుకుంటుందన్నారు. ఆర్షధర్మాన్నీ, భారతీయతను, మంచితనాన్నీ, మనిషితనాన్నీ, మానవీయతను, విప్లవాత్మకతను తనదైన శైలిలో, పద సౌందర్యంతో చక్కటి పాటలు తన కలం నుంచి జాలువారించి సిరివెన్నెల సీతారామశాస్త్రి తెలుగువారి గుండెల్లో తన స్థానాన్ని పదిలపరుచుకొన్నారని ఎన్వీఎస్ రెడ్డి కొనియాడారు. కోవిడ్ కాలంలో నాకు దొరికిన విశ్రాంతి సమయాన్ని వినియోగించుకొని నేను హైదరాబాద్ మెట్రో చరిత్రనంతా 58 కవితలుగా మాత్రాచ్ఛందస్సులో 'మేఘపథం' అనే కావ్యంగా రాసినపుడు శాస్త్రి దానికి ముందు మాట రాస్తానన్నారు. కానీ, అనారోగ్యం వల్ల రాయకుండానే వెళ్లిపోయారని గుర్తుచేశారు. అయినా ఆయన అమరుడు.. అమృతాన్ని కురిపించిన వాడు.. ఆయన కురిపించిన అమృతాన్ని మనం దోసిళ్లతో తాగగల్గుతున్నామని ఆయన తెలిపారు. విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ వెల్చాల కొండలరావు సమర్పణలో ముద్రితమైన ఈ చిరు పుస్తకం సిరివెన్నెల వ్యక్తిత్వాన్ని క్లుప్తంగా తెలియపరచే మంచి పుస్తకం అని ఎన్వీఎస్ రెడ్డి అభివర్ణించారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర నష్టం

- రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అవకాశాలు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారని రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి జాతీయ కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా దాసు సురేష్ హాజరై మాట్లాడుతూ రిజర్వేషన్ల ద్వారానే వెనుకబడిన వర్గాలకు అవకాశాలు దక్కుతున్నాయన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం రాజకీయాలపై ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం వలన వెనుకబడిన వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయడమే పట్టించుకోని పాలకులు రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ రిజర్వేషన్ల అమలు అధికారం ఆయా రాష్ట్రాలకు ఉందని తమిళనాడు, బీహార్ రాష్ట్రాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను అమలు చేయడం లేదని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేసేందుకు జీవో 26ను తీసుకువచ్చిందని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉస్మాన్ గంజ్‌లోని బాస్ కార్యాలయంలో అయ్యప్ప భక్తులకు ఉచిత అన్నదానం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఉస్మాన్ గంజ్‌లోని సమితి కార్యాలయంలో నేటి నుంచి జనవరి 14వ తేదీ వరకు 41 రోజుల పాటు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని సమితి అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మేడిశెట్టి రాకేష్, కోశాధికారి, సీఏ అనిల్ నాయర్ లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్యాతం రాధాకృష్ణ మాట్లాడుతూ.. బాస్ ఆధ్వర్యంలో గత 16 ఏండ్లుగా అయ్యప్ప మాల దీక్ష ధరించిన వారికి 41 రోజుల పాటు అన్నదానం అల్పాహారం విజయవంతంగా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. అదేవిధంగా ఉస్మానియా ఆస్పత్రిలో మంచినీటి ఆర్వో వాటర్ ప్లాంట్‌తో మంచినీటినీ అందిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో ఎగ్జిబిషన్ మైదానంలో కూడా భారీ ఎత్తున అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు కాటేపల్లి రాజు, నార్ల జగదీష్, నర్సింగ్ రావు, విజేందర్ రెడ్డి, వై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మించిన నియంత ఉన్నాడా..?

- బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు సంకెళ్లు, లాఠీల గాయాలు
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డిని నియంత అంటూ విమర్శిస్తున్న కేటీఆర్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన నిర్బంధం గుర్తుకు లేదా అని, కేసీఆర్‌ను మించిన నియంత ఉన్నారని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ విమర్శించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రైతుల కోసం పోరాటాలు చేస్తున్నారని కేటీఆర్ మాట్లాడుతున్నారని, రైతుల నుంచే కమిషన్ తీసుకున్నోడు రైతు పక్షపాతి ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. షాబాద్ ఏరియాలో భూముల రిజిస్ట్రేషన్లు కావాలంటే పట్నం పన్ను కట్టాల్సిందేనని, టాటా కంపెనీ పట్నం పన్ను కట్టలేకే కలకత్తాకు వెళ్లిన మాట వాస్తవం కాదా అని సూటిగా ప్రశ్నించారు. సీతారామపురం హయతాబాద్ అసైన్డ్ భూముల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఎకరానికి రూ.21లక్షలు భూపరిహారం ఇస్తే అందులో సగం రూపాయలు పట్నం పన్ను కింద దండుకున్న నీచమైన చరిత్ర నరేందర్ రెడ్డిది కాదా అని ప్రశ్నించారు. ఎన్నో ఏండ్లుగా వెనకబడిన కొడంగల్‌లో పరిశ్రమలు వస్తే ఓర్చుకోవట్లేదని, సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల అభివృద్ధి చేసుకున్నప్పుడు మా నాయకుడు ఏమనలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తుంటే ఎందుకింత కడుపుమంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేరెళ్లల్లో మీ అక్రమ ఇసుక దందాను అడ్డుకున్న దళితులను పనికి రాకుండా కొట్టించింది తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం తీసుకువస్తే దాన్ని తుంగలో తొక్కి జీవో 123 తీసుకువచ్చి, దాన్ని అడ్డం పెట్టుకుని గద్దల్లా పీక్కుతిన్న మీరు రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను బెదిరించిన నీచమైన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని, ప్రజాపాలన అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ సలహాదారులు బడేసాబ్, నాయకులు జెర్రిపోతుల నాగేష్, పూల నవీన్, గాలిగల్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ, ఐక్యత భావం పెంపొందుతుంది



- నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఏవీ.రాజశేఖర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎన్ సీసీతో (నేషనల్ క్యాడేట్ కోర్), ఎన్ఎస్ఎస్ వల్ల విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఐక్యత భావం పెంపొందుతుందని నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నిజాం కళాశాలలో 'ఎన్ సీసీ డే' ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సీసీ క్యాడెట్లు పెరేడ్‌తో పాటు పలు విన్యాసాలను ప్రదర్శించారు. ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి జాతీయ సమైక్యత, సేవా భావం, దేశ సాంస్కృతిక ఔన్నత్యం మొదలైన అంశాలపై సందేశం ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ ఏవీ.రాజశేఖర్ మాట్లాడుతూ దేశభక్తి, సామాజిక సేవ, ఉన్నతమైన విలువలను పెంపొందించడంలో ఎన్‌సీసీతో పాటు ఎన్ఎస్ఎస్ దేశంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభాతో పాటు జాతీయ స్థాయిలో సాధిస్తున్న అవార్డులు నిజాం కళాశాలకు ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్, ఎన్ సీసీ కెప్టెన్ టి.గంగాధర్, ఆఫీసర్ డాక్టర్ నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ధూల్‌పేట్

గోషామహల్ నియోజకవర్గం చుడీబజార్ అరుంధతి సేవా మండలి ప్రధాన కార్యాలయంలో కమిటీ దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనం-2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షులు మిద్దె కృష్ణ, ప్రధాన కార్యదర్శి మ్యతరి ధర్మేంద్ర మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో 36 బస్తీలకు ప్రధాన కేంద్రంగా కొనసాగుతుం దన్నారు. అన్ని బస్తీల కమిటీలతో మమేకమై మరింత అభివృద్ధికి పాటుపడు తున్నామని తెలిపారు. పాల్గొన్న బస్తీ కమిటీల ప్రతినిధులను సన్మానించారు. ఎలక్షన్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్, కమిటీ సభ్యులు అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎంఎల్‌సి కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన గోషా మహల్ నియోజకవర్గం టీఆర్ఎస్ నాయకులు తెలంగాణ శేఖర్ చారి తదితరులు



ఘనంగా చిదంబరం నటరాజ స్వామి వారి కళ్యాణం

నవతెలంగాణ-ముషీరాబాద్

కోటి దీపోత్సవ కార్యక్రమం అశేష జనవాహిని మధ్య అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. కోటిదీపోత్సవంలో తొలిసారిగా ఆకాశలింగక్షేత్రం చిదంబరం నటరాజస్వామి, శివకామసుందరి అమ్మవార్ల కల్యాణం వేద పండితుల అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించారు. వేదికపై పంచభూతలింగ సహిత ద్వాదశజ్యోతిర్లింగ ఆరాధన నిర్వహించారు. తిరుపతి రామ కృష్ణమఠం, శ్రీ సుకృతానందస్వామి, విశాఖపట్నం రామకృష్ణ మఠం, శ్రీ స్వసంవేద్యానందస్వామి ఆశీర్వచనం చేశారు. డా. ధూళిపాళ్ల మహ దేవమణి తన ప్రవచనంతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. కోటిదీపాల వెలుగులు సప్తహారతి కాంతులు అంబరాన్నంటే మహాదేవుని నీరాజనాలు పలికారు.

హవాలా నగదు పట్టివేత..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అక్రమంగా తరలిస్తున్న హవాలా నగదును ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.6 లక్షల 69 వేలు నగదు స్వాధీనం చేసుకున్న ఘటన సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటి రాయల్ ప్లాజా బిల్డింగ్ ఎదురుగా భారీ నగదు హవాలా డబ్బు తరలిస్తున్నారని విశ్వసనీయ సమా చారం అందింది. దీంతో ఏసీపీ తన బృందంతో కలిసి రాయల్ ప్లాజాకు వెళ్లి గమనించగా అక్కడ కొంతమంది రోడ్డుపై గుమ్మి గూడారు. ఈ క్రమంలో సంజయ్ కుమార్ మహంకారి(43), భీమర్ భాయ్ దేవాజీ భాయ్ రాజ్‌పుత్(25), అర్జున్ భాయ్ చందాజీ రాజ్‌పుత్(34) అనుమానస్పదంగా బ్లాక్ కలర్ బ్యాగును ఉంచారు. క్రమంలో ఏసీపీ తన బృందంతో కలిసి వారిని చుట్టుముట్టి బ్యాగును తానికి చేయగా అందులో రూ.6 లక్షల 69 వేలు నగదు లభించింది. ఈ నగదుకు సంబంధిం చిన సరైన పత్రాలు చూపించకపోవడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నగదు, 3 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకొని ఆదాయపు పన్ను శాఖకు అప్పచెప్పినట్లు ఏసీపీ తెలిపారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణ దానం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

రక్తదానం చేయడంతో మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతారని బీఆర్ఎస్ బహదూర్ పుర నియోజక వర్గం సీనియర్ నాయకులు మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, నియోజకవర్గం ఇన్‌చార్జి చిగుల్లా సాయి కిరణ్‌లు అన్నారు. నియోజకవర్గం కిషన్ బాగ్ డివిజన్‌లో వారి నేతృత్వంలో ఐఎల్ డబ్ల్యుఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది ప్రమాద వసత్తు శతగాత్రులైన వారికి, రక్తం అవసరమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఎంతో దోహద పడతాయన్నారు. రక్తదానం ఎంతో మంది ప్రాణాలు పోసిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రెహానా బేగం, అమన్, యూసుఫ్, రషీద్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

మాజీ కేంద్ర సాయుధ బలగాల సిబ్బందికి వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి మమ్మీల రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ దేశ సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమరులకు ఘన నివాళులర్పించి వారి కుటుంబాలను పరామర్శించి సన్మానించారు. 2012 అప్పటి యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఆఫీస్ మెమొరండం ప్రకారం మాజీ కేంద్ర సాయుధ బలగాలకు సైనిక దళాలకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను వర్తింపచేయమని ఆ జీవోను అమలు చేయాలని కోరారు. సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా డిఫెన్స్ ఫోర్సెస్ మాదిరిగా సీఏపీఎఫ్ సభ్యులకు ఇంటి పనులు రద్దు చేయాలన్నారు. ఉన్నత చదువుల్లో సీఏపీ కోటాను వర్తింపచేయాలని కోరారు. హైదరాబాదులో కమ్యూనిటీ సెంటర్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం వెంకట రెడ్డి, సలహాదారులు ఎస్ఎన్‌రెడ్డి, భగవంతు, సీటీ రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, మహిళ విభాగం ప్రెసిడెంట్ భారతి, ప్రధాన కార్యదర్శి ప్రేమ రెడ్డి, ఉపాధ్యక్షులు నర్సమ్మ సభ్యులు అరుణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ కృతజ్ఞత సభ'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వైద్య, ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్‌గా శాశ్వత ఉద్యోగులుగా నియమింపబడిన వారందరూ ఆదివారం విజయవంతంగా కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన శాసన మండలి సభ్యులు, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, ఎమ్మెల్సీ డా.బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఇలాంటి కృతజ్ఞత సభ నిర్వహించటం మంచి ఆనవాయితీ అని, వీరంతా గత ఏడు సంవత్సరాలుగా పోరాడి కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగులుగా నియామక పత్రాలు అందుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డా.పుట్ల శ్రీనివాస్, వెంకటేశ్వర రెడ్డి, మంచాల రవీందర్, సుదర్శ న్, హరినాథ్, మహ్మద్ సలీం, రాజశేఖర్, నిర్వాహకులు విజయ్ కుమార్, వెంకటపతి, స్రవంతి, రహీం, విజయరాజ్, జనార్ధన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థానిక సంస్థలలో రజకులకు అవకాశం కల్పించాలి

- రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వ స్థానిక సంస్థలలో రజకులకు అవకాశం కల్పించాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంకటస్వామి అధ్యక్షతన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ రజక సహకార సంఘాలను ప్రతి డివిజన్ పరిధిలో సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఉన్నటువంటి సొసైటీలను వెంటనే హైదరాబాద్ బీసీ అభివృద్ధి కార్యాలయంలో రెన్యువల్ కోసం దరఖాస్తు చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పాత ఇస్త్రీ రేట్ల సవరిస్తూ కొత్త రేట్లు పెంపు కోసం ప్రతి ఒక్క వృత్తిదారుడు కృషి చేయాలని అందుకు రేట్ల పట్టికలు ఇస్త్రీ దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కమిటీ తీర్మానించిందని తెలిపారు. 2025 నూతన సంవత్సరం సంఘ క్యాలెండర్ యాడ్ చేర్పించుటకు ప్రతి సభ్యుడు సహకరించాలని సంఘం జిల్లా కమిటీలో నిర్ణయించామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకట్ స్వామి మాట్లాడుతూ ఇల్లు లేని పేద వృత్తిదారులకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రక్క ఇల్లు మంజూరు ఇవ్వాలని కోరారు. నేటికీ రజకవృత్తిదారులపై గ్రామీణ ప్రాంతంలో కుల వివక్షత, దౌర్జన్యాలు, సామాజిక దాడులు పెత్తందారి వర్గాలచే కొనసాగుతున్నాయని వాటి అరికట్టడానికి సామాజిక భద్రత ప్రత్యేక చట్టం కల్పించి ఆదుకోవాలని, రజక వృత్తిని ఆధునికరిస్తూ ఉపాధి కల్పనకు మోడరన్ దోబీఘట్ ప్రతి మండల కేంద్రంలో, మున్సిపాలిటీలలో నిర్మించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. 50 ఏండ్లు నిండిన వృత్తిదారులందరికీ వృద్ధాప్య పెన్షన్స్ పథకం ఏర్పాటు చేయాలని, ఐదు లక్షల బీమా పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లొంక్క సోమయ్య, వి.యాదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శిలు రాపర్తి ప్రభాకర్, ముదిగొండ రమేష్, పి.భాస్కరరావు, అల్వాల బాబు, జిల్లా సోషల్ మీడియా సిహెచ్ నాగేష్ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ పద్మ, పి.రాజు, ఆర్. తిరుపతి, కే.మంగయ్య, కేశరాజు గోపి, కేశవులు, రమేష్, ఈ లక్ష్మయ్య, జి అశోక్, తదిరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

'జైన్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్' ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బెంగళూరుకు చెందిన జైన్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ (జేఆర్ఐఎస్), ది స్పోర్ట్స్ స్కూల్ సహకారంతో భారతదేశపు మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్, ఫ్యూచర్-25ని ప్రారంభించనుంది. 8 మెట్రో నగరాల్లో నిర్వహించే ఈ కార్యక్రమం మొదటి వేడుకను సికింద్రాబాద్ లోని చిరాన్ ఫోర్ట్ క్లబ్‌లో నిర్వహించారు. బ్యాడ్మింటన్ లెజెండ్, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, టెన్నిస్ క్రీడాకారుడు పద్మశ్రీ రోహన్ బోపన్న, క్రికెట్ ఐకాన్ రాబిన్ ఉతప్ప వంటి స్పోర్ట్స్ స్కూల్ నుంచి భాగస్వాములు, మెంటార్‌లతో రాబిన్ ఉతప్పలాంటి భాగస్వాములుగా, మెంటార్లుగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి జేయారెస్ పూర్వ విద్యార్థులతోపాటు ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ సీనియర్ కోచ్ అనిల్‌కుమార్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. తాను పాఠశాలకు వెళ్లే సమయంలో మంచి క్రికెటర్‌ను కావడానికి అవకాశాలు తక్కువగా ఉండటంతో ఆ వైపు వెళ్లలేకపోయానని తెలిపారు. అతి తక్కువ పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీశానని గుర్తు చేశారు. జేఎస్ గ్రూపు వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ చెన్రాజ్ రాయిచంద్ మాట్లాడుతూ జైన్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసి పాతికేండ్లు గడుస్తున్న సందర్భంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్టు తెలిపారు. విద్యతోపాటు చదువులో రాణించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు.



సీపీఐ(ఎం) మహాసభలు జయప్రదం చేయండి



- సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి సీపీఐ (ఎం) శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 7,8 వ తేదీల్లో నిజాం పేట్ ప్రగతి నగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ, విరాళాలు కూడా సేకరించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి.ధర్మారావు, సభ్యులు కె.నర్సమ్మ, కాశీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో.. ప్రతి మూడు సంవత్సరాలకు ఓసారి జరుగుతాయన్నారు. కార్యక్రమాలను సమీక్షించుకొని ప్రణాళిక రూపొందించు కొని, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా ఉద్యమాలు పోరాటాలు నిర్వహించ డానికి.. ఈ మహాసభలు ఉపయోగపడతాయని తెలిపారు. కావున ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయడానికి తమ వంతుగా ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, మల్లేష్, యాదగిరి, మల్లేశ్వరి ,పద్మ ,శివలీల, హారిక, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట


